# ప్రతిపక్షం
www.prathipaksham.in

బుధవారం 25.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 5 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu




సౌతాఫ్రికా టూర్‌కు వుమెనిండియా రెడీ 8



ఎవరైనా వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి.. దానిని క్రియాశీలంగా బోధిస్తూ ప్రచారం చేస్తుంటే.. అతడిని ఎస్సీ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించడానికి వీల్లేదు. జన్మతః ఎస్సీ కులంలో పుట్టిన వ్యక్తి.. హిందూమతం, బౌద్ధమతం, సిక్కుమతం తప్ప మరే మతాన్ని పుచ్చుకున్నా అతడికి ఎస్సీ హోదా దక్కదు. తక్షణమే సంపూర్ణంగా ఆ హోదాను కోల్పోతాడు. షెడ్యూల్డ్ కులాల జాబితాను రూపొందించిన 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వులు ఇదే స్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగం ప్రకారం గానీ, పార్లమెంటు లేదా శాసనసభ చేసిన చట్టం ద్వారా గానీ ఎలాంటి చట్టబద్ధ ప్రయోజనాలు, రక్షణ, రిజర్వేషన్ మతంమారిన వారికి వర్తించవు. సదరు ఉత్తర్వులోని మూడో క్లాజు ప్రకారం.. వారు ఎస్సీ కులానికి చెందరు. దీనికి తిరుగులేదు. ఎలాంటి మినహాయింపూ ఉండదు'

-సుప్రీ కోర్టు

# మతం మారితే ఎస్సీ హోదా దక్కదు

- హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులే అర్హులు
- క్రైస్తవంలో కుల వ్యవస్థకు తావులేదు
- కులం హోదా అంశంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

**న్యూఢిల్లీ, మార్చి 24:** న్యూఢిల్లీ: కులం హోదా అంశంలో సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులు మాత్రమే షెడ్యూల్ కులాల కింద హోదా పొందేందుకు అర్హులని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మూడు మతాలు కాకుండా మరో మతానికి మారితే ఎస్సీలకు ఆ హోదా ఉండదని కోర్టు పేర్కొంది. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారికి షెడ్యూల్ కులాల హోదా దక్కదని కోర్టు స్పష్టం చేసింది. అంటే ఓ దళిత వ్యక్తి ఎవరైనా క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే, అప్పుడు అది ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని సుప్రీం పేర్కొంది. జస్టిస్ పీకే మిశ్రా, మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఓ కేసులో ఆ ఆదేశాలు ఇచ్చింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు కాకుండా మరో మతానికి మారితే , వారు ఎస్సీ హోదాను

...:: మిగతా 2లో

## పొడిగింపు ఇవ్వలేం

- పీజీ వైద్య సీట్ల భర్తీపై సుప్రీం కీలక తీర్పు
- 7 రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తి అయిన నేపథ్యంలో పొడిగింపు అవసరం లేదని వ్యాఖ్య

...:: 3లో

# ఎంపీ సీట్లను ఏ ప్రాతిపదికన పెంచుతారు?



- దీంతో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరం పెరుగుతుంది
- జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల పాత్ర ఉండదు
- కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం ఉండదు
- టీవీ9 సమ్మిట్ 2026 లో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మార్చి 24 :** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో 50 శాతం మేరకు సీట్లను పెంచాలన్న నిర్ణయం ఏ ప్రాతిపదికన చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరాన్ని పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అంతరాన్ని మరింతగా పెంచే ప్రయత్నాలను విరమించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల వారిగా ఉన్న లోక్‌సభ స్థానాల నిష్పత్తిలోనే నియోజకవర్గాలను పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న స్థానాలకు 50 శాతం సీట్లు పెంచుతూ లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపడితే, రేపటి రోజున జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల పాత్ర ఉండదని విశ్లేషించారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో దక్షిణాది రాష్ట్రాల ప్రమేయం లేకుండా పోతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. టీవీ9 నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 'భారతదేశం ప్రపంచం' అన్న ఇతివృత్తంపై "వాట్ ఇండియా థింక్స్ టుడే" సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, మూసీ నది ప్రక్షాళన, తెలంగాణ విజన్ 2047, పరిపాలన, రాజకీయ స్థితిగతులపై అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ అంశంపై తొలుత అఖిల పక్ష సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయం మేరకు మార్గదర్శకాలు రూపొందించాల్సిందని అన్నారు. అలా కాకుండా ముందే నిర్ణయం తీసుకుని, తర్వాత అందరి అభిప్రాయాలు అడగటం సమంజసం కాదన్నారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలనే మేం

...:: మిగతా 2లో



## విదేశాంగ విధానం మోడీ వ్యక్తిగత విధానమైంది

పశ్చిమాసియా సంక్షోభం గురించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మన విదేశాంగ విధానం ప్రధాని మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిపోయిందని దుయ్యబట్టారు.

7



## ఎయిమ్స్‌లో హరీశ్ రాణా మృతి

భారత్‌లో తొలి కారుణ్య మరణం నమోదైంది. 13 ఏళ్లుగా కోమాలో ఉన్న హరీశ్ రాణా సుప్రీం కోర్టు ఆదేశాలతో కారుణ్య మరణాన్ని పొందారు. ఢిల్లీ ఎయిమ్స్‌లోని బీఆర్ అంబేడ్కర్ ఇన్‌స్టిట్యూట్ రోటరీ క్యాన్సర్ యూనిట్‌లో 31 ఏళ్ల హరీశ్ రాణా ప్రశాంతంగా కన్నుమూశారు.

7

# ఏప్రిల్ 25న కవిత పార్టీ ప్రకటన



- "తెలంగాణ ప్రజా జాగృతి" ఎన్నికల గుర్తుగా ధర్మగంట
- జాగృతిలో చేరనున్న సీనియర్ కాంగ్రెస్ నేత
- 27న శ్రీరామనవమి సందర్భంగా కీలక ప్రకటన?

చిటుకుల మైసారెడ్డి

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న "తెలంగాణ ప్రజా జాగృతి" పార్టీ ఆవిర్భావ తేదీగా ఏప్రిల్ 25ను ఖరారు చేసినట్లు సమాచారం. తాజాగా పార్టీ జెండా, ఎజెండా, ఎన్నికల గుర్తుపై కూడా అంతర్గతంగా నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. జాగృతి వర్గాల నుంచి వినిపిస్తున్న వివరాల ప్రకారం, పార్టీ జెండాలో పసుపు, ఆకుపచ్చ రంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పసుపు రంగు సాంస్కృతిక, ఆత్మగౌరవాన్ని, శుభాన్ని సూచిస్తే, ఆకుపచ్చ తెలంగాణ వ్యవసాయ ఆధారిత జీవన విధానానికి ప్రతీకగా ఉండనుందని చెబుతున్నారు. సామాజిక తెలంగాణకు ప్రతీకగా నీలం రంగును కూడా జెండాలో అమర్చనున్నట్లు తెలుస్తున్నది. ఇక ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఎరుపు రంగును కూడా జెండాలో చోటు కల్పించే అవకాశముందని సమాచారం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన ఉద్యమ జ్వాలలను గుర్తుచేసేలా ఈ రంగుల సమ్మేళనం ఉండబోతున్నదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అత్యంత ఆసక్తికర అంశం పార్టీ ఎన్నికల గుర్తు. పార్టీ గుర్తుగా రెండు గుర్తులను ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వాటిలో "ధర్మగంట"

...:: మిగతా 2లో







# హామీల అమలుకు వీలుగా బడ్జెట్ ప్రవేశపెట్టాం

- రాష్ట్రంపై బీఆర్ఎస్ అప్పుల భారం మోపి పోయింది
- ఆర్థిక, పరిపాలన వ్యవస్థలను ధ్వంసం చేసింది
- ఆ అప్పులు చెల్లిస్తేనే అభివృధి, పథకాల అమలు
- ఓర్వలేక బడ్జెట్ కాపీలను చింపి సభ నుంచి వాకౌట్ చేశారు
- బడ్జెట్‌పై జరిగిన చర్చకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మార్చి 24 :** వాస్తవిక దృష్టితో, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి వీలుగా బడ్జెట్ ప్రవేశపెట్టామని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్ పై జరిగిన చర్చకు భట్టి సమాధానమిచ్చారు. రైతు భరోసా, చేయూత, మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్పీజీ సిలిండర్, బియ్యం సబ్సిడీ, డైట్ చార్జీలు వంటి పథకాలకు రూ.50 వేల కోట్ల వరకు కేటాయించామన్నారు. రూ.20,617 కోట్లతో రుణ మాఫీ పథకం అమలు చేశామని చెప్పారు. 'బీజేపీ సభ్యులు చీటింగ్ బడ్జెట్ అంటున్నారు. కుటుంబాలకు రూ.5 లక్షల బీమా ఇవ్వడం, పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పెట్టడం, స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలకు నిధులు కేటాయించడం, ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వడం చీటింగ్ అవుతుందా?' అని భట్టి ప్రశ్నించారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్.. అప్పుల భారాన్ని మోపి పోయిందని, ఇప్పుడా అప్పులను తాము చెల్లించాల్సి వస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అప్పులను తిరిగి చెల్లిస్తూ తాము ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులు చేపడుతూ, పథకాలు అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. దీనిని చూసి ఓర్వలేక బడ్జెట్ కాపీలను చింపి, చెవుల్లో పెట్టుకుని, సభ నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోవడం ద్వారా ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. 202627 బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చకు భట్టి సమాధానమిచ్చారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా అన్ని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ యువ వికాసం పథకాలకు నిధులను

...:: మిగతా 2లో

# యుద్ధం వల్ల తీవ్రమైన ఇంధన సంక్షోభం

- భారత్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది
- పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులను గమనిస్తున్నాం
- సంక్షోభ నివారణకు సాధికారత బృందాలు
- టీమ్ ఇండియా స్ఫూర్తితో రాష్ట్రాలు పనిచేయాలి
- దేశంలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయి
- యుద్ధ పరిస్థితులపై రాజ్యసభలో ప్రధాని ప్రకటన



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

**న్యూఢిల్లీ, మార్చి 24:** పశ్చిమాసియా యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇంధన సంక్షోభం ఏర్పడిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భారత్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉందన్నారు. పశ్చిమాసియా యుద్ధంతో ఏర్పడిన పరిస్థితులు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రధాని మోడీ రాజ్యసభలో ఓ ప్రకటన చేశారు. యుద్ధం వాణిజ్య మార్గాలపై ప్రభావం చూపడమే కాకుండా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత వరకు తక్కువ

...:: మిగతా 2లో



## మోడీ, అమిత్ షాకు బాంబు బెదిరింపు

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు.

7

# 'సాదాబైనామా'కు త్వరలో పరిష్కారం

- కొనుగోలుదారు అఫిడవిట్ ఇస్తే సరిపోతుంది
- దరఖాస్తుదారులకు మేలు జరిగేలా జీఓ 76
- శాసన మండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, మార్చి 24:** రాష్ట్రంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను వీలైనంత త్వరితగతిన పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సాదబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించిందని, కానీ 2020 ఆర్ఓఆర్. చట్టంలో పరిష్కారం మార్గం చూపించలేదన్నారు. భూ భారతి చట్టంలో ఈ సమస్యకు పరిష్కారం చూపించడం జరిగిందని, అయితే కొనుగోలుదారు అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనను పొందుపరచడంవల్ల క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకోవాలని నిర్ణయించామని, ఈ మేరకు జీ.ఓ. 76ను విడుదల చేయడం జరిగిందని

...:: మిగతా 2లో

# మావోయిస్టు అగ్రనేత పాపారావు లొంగుబాటు

- 17 మంది అనుచరులతో కలిసి సరెండర్
- 8 ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్ స్వాధీనం



**బస్తర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయారు. 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు,

...:: మిగతా 2లో



## సైనిక సన్నద్ధతపై రక్షణమంత్రి సమీక్ష

అంతర్జాతీయ, ప్రాంతీయ సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ భద్రత, సైనికపరమైన సన్నద్ధతపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

7

రాష్ట్రీయం

# ఎంపీ సీట్లను ఏ ప్రాతిపదికన పెంచుతారు?

**మొదటిపేజీ తరువాయి**

కోరుకుంటున్నామని చెప్పారు. ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలే కేంద్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలు వివక్షకు గురికావడమే కాకుండా తీరని నష్టం జరుగుతుందని అన్నారు. మంచి ఎక్కడున్నా స్వీకరిస్తామని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు మూడు బుల్లెట్ ట్రెయిన్లు ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు చెప్పానని గుర్తుచేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత సమస్యను ఎదుర్కొనడానికి కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

# యుద్ధం వల్ల తీవ్రమైన ఇంధన సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి**

ఉండేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులను గమనిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో యుద్ధం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని, దేశంలో ముడిచమురు, గ్యాస్, ఎరువుల రవాణాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోందని, ఆ దేశాలతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని చెప్పారు. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకొచ్చామని పేర్కొన్నారు. "గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు పనిచేస్తున్నారు. భారతీయుల జీవనోపాధికి రక్షణ కల్పించడం అత్యంత ఆందోళన కలిగించే అంశం. హర్మూజ్ జలసంధిలో అనేక నౌకలు చిక్కుకున్నాయి. నిలిచిపోయిన నౌకల్లో భారతీయ సిబ్బంది చాలామంది చిక్కుకున్నారు. క్లిష్ట సమయంలో అంతా ఒక్కటై చర్చించడం అత్యావశ్యకం. ఎంత క్లిష్టమైన సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. సమస్యకు చక్కని పరిష్కారమే కీలక అంశం. శాంతియుత పరిష్కారం వైపు అన్ని పక్షాలను కోరుతున్నాం. అన్ని సమస్యలకు ఏకైక పరిష్కారం చర్చలు, సంప్రదింపులు. యుద్ధం మొదలైన నాటి నుంచి రెండు విడతల్లో పశ్చిమాసియాలోని అనేక దేశాల అధినేతలతో ఫోన్‌లో మాట్లాడాను. గల్ఫ్ దేశాలతో పాటు ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నాం." అని నరేంద్ర మోదీ తెలిపారు. "ఈ సమస్యకు వీలైనంత త్వరగా శాంతియుత పరిష్కారానికి అని రకాలుగా భారత్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి సంక్షోభ సమయంలో దేశంలో పౌరులతో పాటు విదేశాల్లోని భారతీయులను సురక్షితంగా ఉంచడం మా ప్రథమ కర్తవ్యం. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 3.75లక్షల మందికి పైగా విదేశాల్లోని భారతీయులను సురక్షితంగా తీసుకువచ్చాం. ఒక్క ఇరాన్ నుంచే వెయ్యికి పైగా భారతీయ పౌరులు వచ్చారు. ఇందులో 700 మంది మెడిసిన చదువుతున్న యువత ఉన్నారు. మా దౌత్యం ద్వారా యుద్ధ పరిస్థితుల్లోనూ నౌకలు సురక్షితంగా వచ్చేలా ప్రయత్నాలు చేపట్టాం. చర్చల ద్వారానే సమస్య పరిష్కారానికి భారత్ కృషి చేస్తోంది." అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.



# మావోయిస్టు అగ్రనేత పాపారావు లొంగుబాటు

**మొదటిపేజీ తరువాయి**

8 మంది మహిళలు) కలిసి లొంగిపోయారు. వీరి నుంచి 8 ఏకే47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ గా పాపారావు ఉన్నాడు. అతడిపై 50 కేసుల వరకు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ ను కిడ్నాప్ చేసిన ఘటనలోనూ, గతంలో 76 మంది భద్రతా సిబ్బందిని బలిగొన్న ఘటనలోనూ పాపారావు హస్తం ఉందని భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరించారు. పాపారావు లొంగుబాటుతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఇక క్రియాశీల సభ్యులెవరూ లేరని ఆయన తెలిపారు. లొంగిపోయే ముందు తాను పాపారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. రాష్ట్రం వెలుపల కేవలం ఇద్దరు అగ్ర నేతలు మిషిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. పాపారావు లొంగుబాటుతో బస్తర్‌లో సాయుధ నక్సలిజం పూర్తిగా అంతమైందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ పరిణామంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. గడువు ముగిసిన తర్వాత అమాయక ఆదివాసులపై వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని, వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అరెస్టులు చేయవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ హెచ్చరించారు. బస్తర్ సహజ వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రమాదం కూడా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

# 'సాదాబైనామా'కు త్వరలో పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారు. రాష్ట్రంలో 9 లక్షలకు పైగా దరఖాస్తును పెండింగ్ లో ఉన్నాయని, వీటన్నింటికీ పరిష్కారం లభించబోతుందని తెలిపారు. నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలల్లో ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించామని, ఇందులో ప్రతీ సర్వే నెంబర్ కు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ కేటాయించడం జరిగిందని అన్నారు. త్వరలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో ప్రతీ జిల్లలో 70 గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఆనాడు ధరణి పోర్టల్ ను నాలుగు గోడల మధ్య ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి తీసుకొచ్చారని, దీని వల్లే కొత్తగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని విమర్శించారు. ధరణి పోర్టల్ లో 40, 41 మాడ్యుల్స్ ఉంటే భూ భారతి పోర్టల్ లో 6 కు కుదించామని, ధరణి పోర్టల్ ను అర్ధరాత్రి ఒక్కరోజు మార్చేది కాదని, దశలవారీగా మార్పులు చేసుకుంటూ వస్తున్నామని, ఈ ఏప్రిల్ చివరి నాటికి పూర్తి స్థాయిలో భూ భారతి పోర్టల్ ను తెస్తామని తెలిపారు.




# మార్కెట్లోకి 'బ్లూ స్టార్' ఐకోనియా ఏసీలు

- లాంఛనంగా ప్రారంభించిన కంపెనీ ప్రతినిధులు

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** నివాస, వాణిజ్య కూలింగ్ విభాగాలలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకోనున్నట్లు ఏసీ ఉత్పత్తుల ప్రముఖ కంపెనీ 'బ్లూ స్టార్' ప్రకటించింది. ఇందుకోసం ప్రీమియం శ్రేణీ ఐకోనియా ఉత్పత్తులను విడుదల చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో బ్లూస్టార్ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ గిరీష్ హింగోరని, ఆ గ్రూప్ ప్రెసిడెంట్ మోహిత్ సుద్ ఐకోనియా ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఇప్పుడు 125 రకాల రూమ్ ఎయిర్ కండిషనర్ మోడళ్లు ఉన్నాయన్నారు. ఇందులో వినియోగదారుల అవసరాలకు, వివిధ రకాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఫ్లాగషిప్ ప్రీమియం శ్రేణి ఐకోనియా కూడా ఉందన్నారు. వినియోగదారుల మన్ననలను పొందేందుకు తమ ప్రయత్నం కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం 1.4 కోట్ల యూనిట్లుగా ఉన్న ఏసీ మార్కెట్.. 2030 నాటికి 3 కోట్ల యూనిట్లకు విస్తరిస్తుందని అంచనా వేశారు.

# మతం మారితే ఎస్సీ హోదా దక్కదు

**మొదటిపేజీ తరువాయి**

కోల్పోతారని కోర్టు చెప్పింది. 'ఎవరైనా వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారి.. దానిని క్రియాశీలంగా బోధిస్తూ ప్రచారం చేస్తుంటే.. అతడిని ఎస్సీ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించడానికి వీల్లేదు. జన్మతః ఎస్సీ కులంలో పుట్టిన వ్యక్తి.. హిందూమతం, బౌద్ధమతం, సిక్కుమతం తప్ప మరే మతాన్ని పుచ్చుకున్నా అతడికి ఎస్సీ హోదా దక్కదు. తక్షణమే సంపూర్ణంగా ఆ హోదాను కోల్పోతాడు. షెడ్యూల్డ్ కులాల జాబితాను రూపొందించిన 1950 నాటి రాజ్యాంగ ఉత్తర్వులు ఇదే స్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగం ప్రకారం గానీ, పార్లమెంటు లేదా శాసనసభ చేసిన చట్టం ద్వారా గానీ ఎలాంటి చట్టబద్ధ ప్రయోజనాలు, రక్షణ, రిజర్వేషన్ మతంమారిన వారికి వర్తించవు. సదరు ఉత్తర్వులోని మూడో క్లాజు ప్రకారం.. వారు ఎస్సీ కులానికి చెందరు. దీనికి తిరుగులేదు. ఎలాంటి మినహాయింపూ ఉండదు' అని సుప్రీ కోర్టు స్పష్టం చేసింది. 1950లో హిందువులకు మాత్రమే ఎస్సీ హోదా ఉండేదని, 1956లో సిక్కు మతస్థులను, 1990లో బౌద్ధ మతస్థులను ఈ జాబితాలో చేర్చారని గుర్తు చేసింది. ఈ జాబితాలో క్రైస్తవం లేదా ఇస్లాం మతాలు లేవని స్పష్టం చేసింది. క్రైస్తవంలో కుల వ్యవస్థకు తావులేదని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. 'క్రైస్తవ మతం కుల వ్యవస్థను అంగీకరించదు. అందరూ క్రీస్తునందు సమానమే. అక్కడ ఎవరినీ యూదులుగానో, అన్యులుగానో, దాసులుగానో చూడరు. ఒక వ్యక్తి క్రైస్తవంలోకి మారిన తర్వాత, హిందూ మతంలోని సామాజిక వివక్ష నుంచి బయటపడినట్లు భావించాలి. అటువంటి పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ కోరడం చెల్లదు' అని తీర్పులో స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాస్టర్ చిందాడ ఆనంద్ దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి ఈ ఆదేశాలు ఇచ్చింది. మే 2025లో ఏపీ హైకోర్టు ఈ కేసులో తీర్పును వెలువరించింది. అక్కాల రామిరెడ్డి అనే వ్యక్తి నుంచి కుల వివక్షత ఆరోపణలు ఎదుర్కొన్నట్లు ఆనంద్ తన పిటీషన్‌లో పేర్కొన్నాడు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఆ పాస్టర్ ఫిర్యాదు నమోదు చేశాడు. అతని ఫిర్యాదు ప్రకారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆనంద్ అనే వ్యక్తి క్రైస్తవ మతాన్ని స్వీకరించడం వల్ల ఎస్సీ హోదాను కోల్పోయాడని, అందుకే ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తున్నట్లు జస్టిస్ ఎన్ హరినాథ్ తన తీర్పులో పేర్కొన్నారు. క్రైస్తవాన్ని ప్రచారం చేస్తున్న దళిత వ్యక్తి.. ఎస్సీఎస్టీ చట్టం కింద న్యాయం పొందలేడని కోర్టు చెప్పింది. క్రైస్తవ మతానికి మారడం వల్ల ఆనంద్ వద్ద ఉన్న ఎస్సీ సర్టిఫికేట్ పనికిరాదు అని కోర్టు తెలిపింది. దీంతో హైకోర్టు తీర్పును తప్పుపడుతూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అయితే హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఇవాళ సుప్రీం తీర్పును ఇచ్చింది.

# హామీల అమలుకు వీలుగా బడ్జెట్ ప్రవేశపెట్టాం

**మొదటిపేజీ తరువాయి**

కేటాయించామన్నారు. "2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ వాళ్లు పరిపాలించారు. 201415లో అసలు, వడ్డీ కింద రూ.7,254 కోట్ల చెల్లింపులు ఉండేవి. కానీ ఇప్పుడా చెల్లింపులు రూ.66,545 కోట్లకు చేరాయి. ఇలా రాష్ట్రంపై మోయలేనంత భారాన్ని మోపిపోయారు. ఈ అప్పులను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఖర్చు పెట్టారా అంటే... కాళేశ్వరానికి పెట్టారు. అది ఏమైందో అందరూ చూశారు. తెచ్చిన అప్పులు రాష్ట్రానికి గుదిబండలా తయారయ్యాయి. ఈ మూడేళ్లలో మొత్తంగా మేము రూ.1,59,165 కోట్ల అప్పు తెస్తే... అసలు, వడ్డీల కింద మేము చెల్లించిన సొమ్ము రూ.1,85.090 కోట్లు. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి. ఇవన్నీ కడుతూనే ఇరిగేషన్, రోడ్లు, స్కూళ్లు, హైదరాబాద్ అభివృద్ధికి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులిస్తున్నాం. ఈ లెక్కలు, వాస్తవాలను బయటపడితే బీఆర్ఎస్ సభ్యులు జీర్ణం చేసుకోలేక... సమాధానం చెప్పలేక బడ్జెట్ పుస్తకం చింపి బయటకు వెళ్లిపోయారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక, పరిపాలన వ్యవస్థలను ధ్వంసం చేశారు"ని భట్టి అన్నారు.

**హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుదాం: మంత్రి శ్రీధర్ బాబు**

నగర అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలు, ప్రాజెక్టుల అమలు అంశాలపై శాసనసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యుల ప్రశ్నకు ముఖ్యమంత్రి తరపున మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. మూసీ విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని అన్నారు. రూ.16 వేల కోట్లతో నగరంలో పనులు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెండేళ్లలో కేవలం రూ.122 కోట్లు ఖర్చు చేస్తే పనులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు : హెచ్‌సిటీ కింద రూ.7,032కోట్ల అంచనాతో 26 పనులతో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం ఇచ్చినట్టు వెల్లడించారు. రెండేళ్లలో రూ.122 కోట్లు ఖర్చు చేశామన్నారు. 202627లో రూ.2250 కోట్లు ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.

**ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటన**

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికలో చేర్చిన తరువాత డీపీఆర్ తయారు చేస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. విజయవాడ రహదారి ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ట్రాఫిక్ రద్దీగా ఉందని, రామోజీ ఫిల్మ్ సిటీ దాటిన తరువాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అసెంబ్లీ వేదికగా కోరారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంపై ప్రశ్నించారు. తాండూరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అవేదన వ్యక్తం చేశారు. బుద్దారం, నాగులపల్లి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ జంట నగరాల రోడ్లపైనే సభ్యులు మాట్లాడారని, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు నాగపూర్ తరహాలో డబుల్ డెక్కర్ రోడ్డు కావాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు చెప్పారు. డబుల్ డెక్కర్ రోడ్డు ప్రపోజల్స్ పంపడం జరిగిందని మూడు, నాలుగు నెలల్లో మంజూరు చేయించుకుని, ఆరు నెలల్లో పనులు ప్రారంభించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని, తెలంగాణ రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఏపీలోని విజయవాడకు రెండు, మూడు గంటల్లో చేరే విధంగా 6 లైన్ రోడ్‌తో పాటు డబుల్ డెక్కర్ రోడ్డు మంజూరు చేయించుకున్నామని వివరించారు.

# డిజిటల్ యుగంలోనూ ఆకాశవాణి పాత్ర సుస్థిరం

- ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్ మార్చి 24 :** వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటుందని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని కవాడీ గూడ సీజీఓ టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్స్, క్యాజువల్ న్యూస్ ఎడిటర్స్, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ మహేష్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ జైన్ మాట్లాడుతూ, ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వృత్తి మెలకువలను పెంపొందిస్తుందని అన్నారు. సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా, ఆ సవాలును అధిగమించాలని రాజీవ్ కుమార్ జైన్ కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల వార్తలకు నిర్వచనమే మారిపోయిందని పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌గా ఆకాశవాణిలో ఖచ్చితత్వం, ధర్మనిష్టను పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు.

# కాంగ్రెస్ పార్టీలో ఇదే నా చివరి రోజు

- రేపు ఉదయం 10 గంటలకు నా నిర్ణయాన్ని ప్రకటిస్తా
- కాంగ్రెస్ పార్టీ మారటం ఇబ్బందికరంగా ఉంది
- రాజీనామా తర్వాత ప్రజలను కలుస్తా
- భవిష్యత్ నిర్ణయం ఎలా ఉంటుందో తెలియదు
- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వెల్లడి



**ప్రతిపక్షం, జగిత్యాల, మార్చి 24:** రేపు ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా విషయంలో తన నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించనున్నట్లు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. అనంతరం జీవన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన సమస్య పరిష్కారం కానిదిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు పరిష్కారం పార్టీ వద్ద కానీ, తన వద్ద కానీ లేదని వ్యాఖ్యానించారు. పార్టీ మారటం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతో తనది 40 ఏళ్ల అనుబంధమని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. రాజీనామా చేసిన తర్వాత జగిత్యాల నియోజకవర్గ ప్రజలను కలుస్తానని తెలిపారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీలో కలిసి ఉండి, ఇప్పుడు విడిపోవటం బాధకరమని, తదుపరి భవిష్యత్ నిర్ణయం ఎలా ఉంటుందో తనకు కూడా తెలియదని కీలక వ్యాఖ్యలు చేశారు. కర్మసిద్ధాంతం ఎటువైపు తీసుకెళుతుందో వేచి చూడాలని చెప్పారు.

**చర్చలు విఫలం**

కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ లేఖ రాసిన జీవన్‌రెడ్డితో జగిత్యాలలోని తన నివాసంలో మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ భేటీ విఫలమయ్యింది. పీసీసీ ఇచ్చిన హామీతో కూడా జీవన్‌రెడ్డి పట్టు వీడలేదు. దీంతో జీవన్‌రెడ్డి ఇంటి నుంచి వారు వెళ్లిపోయారు. మూడు రోజుల క్రితమే మంత్రి శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ జీవన్‌రెడ్డిని కలిసి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. అయినా మొండిపట్టుతో జీవన్ రెడ్డి 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని కలిసి మాట్లాడామని పీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర, అనుభవం ఉన్న నేత జీవన్‌రెడ్డి అని కొనియాడారు. కొన్ని నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆయన ఇబ్బందిపడ్డారని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం మంత్రి శ్రీధర్‌బాబు జీవన్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీని వీడొద్దని కోరినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ, ఏఐసీసీ జీవన్ రెడ్డిని వదులుకోదల్చుకోలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామాపై పునరాలోచన చేయాలని కోరామని తెలిపారు.

**కాంగ్రెస్ పార్టీలో ఇదే నా చివరి రోజు**

కాంగ్రెస్ పార్టీలో ఇదే నా చివరి రోజు అని జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేపు సమావేశం యథావిధిగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో జీవన్ రెడ్డి ఇంటి పైన ఇందిరా భవన్ అనే పేరుతో ఉన్న ఫ్లెక్సీని కార్యకర్తలు పీసీసీ చీఫ్ వెళ్లిన కొద్దిసేపటికే తొలగించారు. అప్పట్లో ఇందిరా గాంధీ మీద అభిమానంతో తన ఇంటికి ఇందిరా భవన్ అని పేరు పెట్టుకుని ఇంతకాలం జీవన్ రెడ్డి పార్టీ కార్యకలాపాలు కొనసాగించారు. ఇవాళ ఆ పేరుతో ఉన్న ఫ్లెక్సీని కూడా తొలగించడంతో పార్టీకి పూర్తిస్థాయిలో రాజీనామా చేసి గుడ్‌బై చెబుతున్నట్టు కార్యకర్తలు సంకేతాలు ఇచ్చారు.

# ఏప్రిల్ 25న కవిత పార్టీ ప్రకటన

**మొదటిపేజీ తరువాయి**

సింబల్ ను పార్టీ గుర్తుగా ఎంపిక చేసే దిశగా చర్చలు చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. సామాజిక న్యాయం, ప్రజా ధర్మం కోసం పోరాడే పార్టీగా తమను ప్రజల్లో నిలబెట్టేందుకు ఈ గుర్తు ఉపయుక్తమవుతుందని భావిస్తున్నట్లు సమాచారం. పార్టీ ఎజెండాపై కూడా కవిత స్పష్టమైన దిశలో అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, ప్రాంతీయ గౌరవం ప్రధానంగా ఎజెండాలో ఉండే అవకాశముంది. ఇప్పటి వరకు తెలంగాణ జాగృతి ద్వారా చేపట్టిన కార్యక్రమాలను రాజకీయ వేదికపై విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికే బలంగా ఉన్న భారత రాష్ట్ర సమితి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలబడేందుకు కవిత చేస్తున్న ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుంది అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ప్రకటనకు ముందు సిద్ధిపేటలో కేసీఆర్ సన్నిహితులతోనూ పలువురు కీలక నేతలతో సమావేశమయ్యే అవకాశముంది. ప్రముఖ పుణ్యక్షేత్రం వారణాసిలో కాశీ విశ్వేశ్వరుడి దర్శనం చేసుకోనున్నారు. పార్టీ ప్రకటనకు ముందు యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారు. ఆపై మేడ్చల్ లో భారీసంఖ్యలో జన సమీకరణ చేసి పార్టీ గ్రాండ్ లాంచ్ కు పూర్తి ప్రణాళికతో కవిత ముందుకు వెళ్తున్నట్లు సమాచారం. ఇక జెండా, గుర్తు, ఎజెండా ఆల్ సెట్ అనే సంకేతాలు రావడంతో ఈ నెల 27న శ్రీరామనవమి సందర్భంగా పార్టీకి సంబంధించిన కీలక ప్రకటన చేయబోతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ లాంచింగ్ సమయానికి వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ సీనియర్ నాయకులు జాగృతిలో చేరే అవకాశముందని తెలుస్తున్నది. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నేత కూడా జాగృతిలో చేరే విషయంలో సంప్రదింపులు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. "తెలంగాణ ప్రజా జాగృతి" పార్టీ కేవలం ప్రచార స్థాయిలోనే కాకుండా, ప్రాక్టికల్ రాజకీయ రంగంలోకి దిగేందుకు సిద్ధమైందని స్పష్టమవుతోంది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త సమీకరణానికి రంగం సిద్ధమవుతోందా అనే ప్రశ్న ఇప్పుడు హాట్ డిబేట్‌గా మారింది.



టీమ్ ఇండియా కంటే ఐపీఎల్ టీమ్‌ను నిర్మించడమే కష్టం. భారత జట్టుకైతే బెస్ట్ ప్లేయర్స్ ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. కానీ ఐపీఎల్లో ప్లేయర్స్ పది టీమ్స్‌కు డిస్ట్రిబ్యూట్ అవుతారు. ఇలాంటి టైమ్‌లో క్వాలిటీ ప్లేయర్స్ లాస్ట్ మినిట్‌లో రాకపోతే టీమ్ బ్యాలెన్స్ దెబ్బతింటుంది.
- మాజీ క్రికెటర్ సౌరవ్‌గంగూలీ

# కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రులు బద్నాం చేస్తున్నారు

- రాష్ట్రానికి కేంద్రం నిధులపై చర్చకు సిద్ధం
- బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి
- కేంద్రం నిధులపై సభలో బీజేపీ, కాంగ్రెస్ మాటల యుద్ధం
- ఉపన్యాసాలతో ప్రజలకు పనిలేదు: మంత్రి సీతక్క కౌంటర్





**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి మంత్రి సీతక్క మధ్య మాటల యుద్ధం సాగింది. బడ్జెట్ పై చర్చ సమయంలో ఆరు గ్యారంటీల అమలు, వికలాంగులు వితంతుల పెన్షన్ పెంపు విషయంలో మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వంపై విరుచుకుపడుతూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రులు బద్నాం చేస్తున్నారని, రాష్ట్రానికి కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చిందో దానిపై చర్చకు సిద్ధమంటూ సవాల్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మహిళలను మోసం చేస్తున్నారని, వాటికి సమాధానం చెప్పకుండా దాటవేసే ధోరణి సరికాదని విమర్శించారు. వెంటనే స్పందించిన పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క బీజేపీఎల్పీ నేత వాదనలు ఆరోపణలకు కౌంటర్ ఇచ్చారు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్న బీజేపీ గత పది సంవత్సరాలుగా వికలాంగులు, వితంతుల పెన్షన్లు పెంచలేదని ఎదురుదాడికిచేశారు., కేంద్రం చేసిన నల్ల చట్టాలపై రాహుల్ గాంధీ పోరాటంతో వెనక్కి తీసుకున్నారని ఎద్దేవా చేశారు. 16 లక్షల కోట్ల బడా పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేశారు కానీ, రైతు రుణమాఫీ చేయలేదని సీతక్క విమర్శలు గుప్పించారు. వడ్డీ లేని రుణాల మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, కానీ తాము రూ.58 వేల కోట్ల బ్యాంకింగ్ రుణాలు ఇచ్చామని మంత్రి వివరించారు. కేంద్రం ఏ రకంగా మద్దతు ఇవ్వకున్నా ప్రజాసంక్షేమం కోసం నిధులు అధికంగా వెచ్చిస్తున్నామని వెల్లడించారు. కేంద్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత మీకు లేదా అని సూటిగా ప్రశ్నించారు. ''కేంద్ర బడ్జెట్‌లో కనీసం ఏం ఇచ్చారు ఈ విషయం చెప్పండి. తాజాగా ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి ఏం ఇచ్చారు. అదే విధంగా ఒక్క జాతీయ హోదా కూడా ఈ పన్నెండు ఏళ్లలో ఒక్క ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు. విభజన హామీలకు సంబంధించి కానీ, 2014 నుంచి ఉన్న బకాయిలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. దీనిపై వారు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది'అని సీతక్క డిమాండ్ చేశారు.

**ఉపన్యాసాలతో ప్రజలకు పనిలేదు...**

తాము ఉచిత విద్యుత్, సన్న వడ్లకు బోనస్, నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు కడుతున్నామని మంత్రి వివరించారు. బీజేపీ నేతల ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలకు పనిలేదన్నారు. రైతులకు ప్రతి నెల పెన్షన్ ఇస్తామని బీజేపీ ఇచ్చిన హామీ ఏమైందని ఆమె ప్రశ్నించారు. విదేశాల నుంచి నల్లధనం తెచ్చి అందరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని, లీటర్ పెట్రోల్ రూ.50కే ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే ధరలను ఇష్టారాజ్యంగా పెంచారని మండిపడ్డారు. తెలంగాణ నుంచి పన్నులు కావాలి కానీ తెలంగాణ ప్రజల ప్రయోజనాలు పట్టవా అంటూ ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ ఆర్థిక చేయూతతో నాలుగు లక్షల 70 వేల మంది మహిళలు వ్యాపారాలను ప్రారంభించారని వివరించారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేస్తామని సంకల్పంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అయినా కూడా ఎగతాళి చేయడం మీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలకు మంత్రి వాకిటి శ్రీహరి గట్టి కౌంటర్ ఇచ్చారు. ప్రపంచ దేశాలు మోకరిల్లి మహాత్మాగాంధీకి దండం పెడుతున్నాయని, అంతటి గొప్ప వ్యక్తి గాంధీజీని చంపిన గాడ్సేను పొగిడితే ఏట్లా? అని ప్రశ్నించారు. గాంధీజీని చంపిన గాడ్సే గొప్పవాడు ఎలా అవుతాడో బీజేపీ నేతలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాల్లో ప్రోత్సాహకం

- ఉద్యోగులకు 10 నుంచి -20 శాతం డిస్కౌంట్
- ఈవీ పాలసీ ప్రభుత్వం రూపొందిస్తే.. ప్రభుత్వ ఉద్యోగులే బ్రాండ్ అంబాసిడర్
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చిందని దీని ద్వారా రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ పూర్తిగా 100 శాతం మినహాయింపు ఇవ్వడం ద్వారా పాలసీ ప్రారంభమైనప్పటి నుండి లక్షా 15 వేల 551 ఎలక్ట్రిక్ వాహనాలకు 925.94 కోట్ల రూపాయలు ప్రభుత్వం నష్టపోయినప్పటికీ ఎలక్ట్రిక్ వాహనాలు ప్రోత్సహిస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సెక్రటేరియట్లో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులతోకలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 10-20 శాతం డిస్కౌంట్ ఇచ్చేలా మహీంద్రా ఎలక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్, ఓలా తో పాటు పలు కంపెనీలు ముందుకు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సెక్రటేరియట్ లో సీఎస్, డీజీపీ, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి ఈవీ వాహనాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈవీ వాహనాలు ఉపయోగించేలా డిస్కౌంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కొనే వాహనాలు కూడా ఈవీ వాహనాలు ఉండేలా ముఖ్యమంత్రి సూచించారని, అందుకు హైర్ పద్ధతిలో లేదా డిపార్ట్మెంట్ ల నుండి వాహనాలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈవీ వాహనాలకు ఇబ్బందులు లేకుండా అన్ని ప్రాంతాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీఎస్ రామకృష్ణ రావు మాట్లాడుతూ నగరాన్ని కాలుష్య రహిత రాష్టంగా తీర్చిద్దాలనే లక్ష్యంతో ఈవీ వాహనాలను ప్రభుత్వం తీసుకొస్తుందని పేర్కొన్నారు. నగరంలో ఈవిబిబస్సు లను ఇతర వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.




తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, హైదరాబాద్ శ్రుతిలయ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతి ఏటా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికి ఇస్తున్న మాదిరిగా ఈ ఏడాది శ్రుతిలయ సీల్ వెల్ "ఉగాది విశిష్ట ప్రతిభా పురస్కారాలు-2026" లో భాగంగా డా. పొన్నం రవిచంద్ర "ఉగాది జీవన సాఫల్య పురస్కారం" అందుకున్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు అందజేశారు. - ప్రతిపక్షం,హైదరాబాద్




## విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

**ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, మార్చి 24:** విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో కనీసం 20 శాతం బడ్జెట్ కేటాయించాలని కోరుతూ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌక్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహించారు.

# నిరంతర యజ్ఞంలా సీఎం కప్

- తెలంగాణ మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తాం
- సీఎం కప్ రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** రాష్ట్రంలోని క్రీడాకారుల ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కప్‌పోటీలు నిర్వహించామని, ఇది ఒక నిరంతర యజ్ఞంలా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు రాష్ట్ర స్థాయి వివరాలు ఛాంపియన్షిప్ టీమ్లకు ట్రోఫీల బహుకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం కప్‌పోటీలను నిర్వహిస్తున్నామని, ఇది ఒక నిరంతర ప్రక్రియ లాగా ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు క్రీడాకారుల్లో కృషి, పట్టుదల ఉండాలని, అప్పుడే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని మంత్రి అన్నారు. యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కొరకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ లాగా ముందుకు వెళ్తామని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, సీఎం కప్‌పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆన్లైన్లో నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డీవైఎస్ఓలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ కోచ్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు

- మీడియా కమిటీ సమావేశంలో నిర్ణయం
- ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఏసీ - స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ) సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార-పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కోచైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు.జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార-పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డీఎస్ జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** హైదరాబాద్ నగరం ఒక్కసారిగా చల్లబడింది. మంగళవారం సాయంత్రం నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కూకట్ పల్లి, చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లో గట్టిగా వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక సూరారం, కొంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో కూడా మోస్తరు వర్షపాతం నమోదైంది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడుతున్న నగర ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. అయితే, వర్షం కారణంగా ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ముఖ్యంగా ప్రధాన రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాబోయే గంటల్లో కూడా నగరంలో మరిన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని, వర్షం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# కౌన్సెలింగ్‌కు ఇకపై పొడిగింపు ఇవ్వలేం

- పీజీ వైద్య సీట్ల భర్తీపై సుప్రీం కీలక తీర్పు
- 7 రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తి అయిన నేపథ్యంలో పొడిగింపు అవసరం లేదని వ్యాఖ్య



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 24:** తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ఎదురుచూస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు పెద్ద షాక్‌గా మారింది. పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో మిగిలిపోయిన పీజీ వైద్య సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ గడువును పొడిగించాలని దాఖలైన పిటిషన్లను జస్టిస్ పీఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. నేషనల్ మెడికల్ కమిషన్ వాదనలతో ఏకీభవిస్తూ కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏడు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించామని, ఇంతకంటే ఎక్కువ రౌండ్లు నిర్వహించడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తే విద్యా క్యాలెండర్ దెబ్బతింటుందని, ఇది వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం కొన్ని సీట్లు మిగిలిపోవడం సహజమేనని, ముఖ్యంగా ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధిక ఫీజుల కారణంగా సీట్లు మిగిలిపోతాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఎన్ఎంసీ తన నివేదికను సమర్పిస్తూ కౌన్సెలింగ్ పొడిగింపును తీవ్రంగా వ్యతిరేకించింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు చెందినవేనని, ప్రభుత్వ సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని వివరించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం, నిర్దేశించిన తేదీ దాటిన తర్వాత అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీటు వస్తుందని ఆశపడిన వందలాది మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరానికి అవకాశం కోల్పోయారు.



# రోహిత్ రెడ్డి, అభిషేక్ సింగ్ పాత్రపై కీలక ఆధారాలు

- మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సంచలనాలు వెలుగులోకి
- ముగ్గురు నిందితులను విచారిస్తున్న విచారణ బృందం
- మిస్టరీగా అభిషేక్ సింగ్ పరారీ

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్:** మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కేంద్రంగా సిట్ విచారణ ముమ్మరంగా సాగుతోంది. నిందితుల వాంగ్మూలాలు ఈ కేసును మరో మలుపు తిప్పాయి. ముగ్గురు నిందితులను విడివిడిగా విచారిస్తున్న సిట్ బృందం పలు సంచలన విషయాలను రాబట్టింది. ప్రధాన నిందితుడు రోహిత్ రెడ్డి గత ఏడాది కాలంగా క్రమం తప్పకుండా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో డ్రగ్స్ సరఫరా చేసిన అభిషేక్ సింగ్ అత్యంత కీలకంగా మారాడు. రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు అతని డ్రైవర్ సిలివేరి శరత్, అవుటర్ రింగ్ రోడ్ వద్ద అభిషేక్ నుంచి డ్రగ్స్ సేకరించినట్లు సిట్ విచారణలో తేలింది. నిందితుల్లో ఒకరైన కౌశిక్ రవి, డ్రగ్స్ సిమ్లా నుంచి తెచ్చినట్లు పోలీసులకు చెప్పి దర్యాప్తును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. అయితే, సిట్ తనదైన శైలిలో విచారించడంతో అసలు విషయం బయటపడింది

**మిస్టరీగా అభిషేక్ సింగ్ పరారీ**

డ్రగ్స్ పార్టీ వ్యవహారం బయటకు రాగానే పెడ్లర్ అభిషేక్ సింగ్ అదృశ్యమయ్యాడు. ఈ నెల 16 నుంచి తన కుమారుడు కనిపించడం లేదని అభిషేక్ తండ్రి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం అభిషేక్ పరారీలో ఉన్నాడని, అతనిని పట్టుకుంటే ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంతమంది ప్రముఖుల పేర్లు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. కాగా, నిందితులను ఘటనా స్థలానికి తీసుకెళ్లి సిట్‌సీన్ రీకన్స్ట్రక్షన్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. నిందితుల మొబైల్ ఫోన్లలోని కాల్ డేటా, వాట్సాప్ చాట్‌లను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. రోహిత్ రెడ్డి రక్త నమూనాలను సేకరించి, డ్రగ్స్ తీసుకున్న సమయాన్ని, రకాన్ని శాస్త్రీయంగా నిర్ధారించనున్నారు. ఈ కేసులో సెలబ్రిటీలు లేదా రాజకీయ ప్రముఖుల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా సిట్ ఆరా తీస్తోంది. అభిషేక్‌సింగ్ దొరికితే ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది.



దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని BJP అనుకుంటోంది. ఏ లెక్క ప్రకారం 50% సీట్ల పెంపు ఉంటుంది. జనాభా ఆధారంగా సీట్లు పెంచితే దక్షిణాదికే నష్టం. సీట్ల పెంపుపై చర్చ జరగాలి. 50% పెంపులోనే కుట్ర ఉంది. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలి.

- సీఎం రేవంత్‌రెడ్డి

# మిగిలిన 'డేటా' ఎక్కడికి పోతోంది..?!

రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా ప్రస్తావించే ప్రతి అంశం సగటు భారతీయుడు ఆలోచనలకూ చాలా దెగ్గరగా ఉంటుంది. ఇప్పటి అనేక అంశాలపై రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక తాజాగా ఆయన రోజువారీ డేటా లిమిట్స్‌తో వచ్చే మొబైల్ రీచార్జ్ ప్లాన్లపై చర్చించారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా టెలికాం సంస్థలు భారీగా డేటా ఇస్తున్నాయి వంటి రోజువారీ డేటా పరిమితులను అందిస్తున్నాయి. అయితే వినియోగదారులు పూర్తిగా డేటా ఉపయోగించకపోతే, మిగిలిన డేటా అర్ధరాత్రి తర్వాత పూర్తిగా రద్దవుతోంది. ఉదాహరణకు, 2GB ప్లాన్ తీసుకున్న వినియోగదారు 1.5GB మాత్రమే వాడితే, మిగిలిన 0.5GB డేటా పూర్తిగా పోతుంది. దీనికి రిఫండ్ లేదా రోల్ ఓవర్ వంటి అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేటి ఆధునిక యుగంలో మనిషికి గాలి, నీరు ఎంత అవసరమో, ఇంటర్నెట్ కూడా అంతే అవసరం. అయితే వినియోగదారులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన మొబైల్ డేటా, నిర్ణీత గడువులోగా వాడకపోతే వృథాగా పోతుంది. దీనిపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా ఈ అంశాన్ని పార్లమెంట్ లో లేవనెత్తుతూ టెలికాం కంపెనీల ప్రస్తుత విధానాల్లో మార్పులు రావాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఆయన పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. ప్రస్తుతం టెలికాం రంగంలో ఉన్న అతి పెద్ద లోపాన్ని రాఘవ్ చద్దా సభ దృష్టికి తీసుకొచ్చారు. వినియోగదారులు ప్రతి రోజూ నిర్దిష్ట డేటా పరిమితి కోసం ముందుగానే డబ్బులు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు ఒక వినియోగదారు రోజుకు 2జీబీ డేటా ప్లాన్ తీసుకుంటే,, అందులో కేవలం 1.5 జీడీ మాత్రమే వాడితే, మిగిలిన 0.5జీ డేటా అర్ధరాత్రి దాటగానే ఎక్స్‌పైర్ అయిపోతుంది. వినియోగదారుడు ఇప్పటికే ఆ జేటా కోసం డబ్బు చెల్లించాడు. అలాంటప్పుడు అది వృథా కావడం లేదా వెనక్కి తీసుకోవడం బాగా లేదు అని చద్దా స్పష్టం చేశారు. ఇది ఏదో అనుకోకుండా జరుగుతున్న పొరపాటు కాదని, టెలికాం కంపెనీలు కావాలనే అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానమని ఆయన మండిపడ్డారు. దీని వల్ల వినియోగదారులు తాము పూర్తిగా వాడుకోలేని సామర్థ్యం కోసం పదే పదే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టెలికాం వినియోగదారుల హక్కులను కాపాడేందుకు రాఘవ చద్దా ప్రధానంగా మూడు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ప్రస్తుత పద్ధతిలో మిగిలిపోయిన డేటా మరుసటి రోజుకు కలవదు. అలా కాకుండా ఒక రోజు మిగిలిపోయన డేటాను మరుసటి రోజు కోటాకు జోడించలా అన్ని టెలికాం సంస్థలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీని వల్ల వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ప్రతి డేటాను సద్వినియోగం చేసుకోనే వీలు ఉంటుంది. కొంతమంది వినియోగదారులు నిరంతరం తమ డేటా పూర్తిగా వాడలేపోతుంటారు. అటువంటి వారి విషంలో, నెల చివరన మిగిలిపోయిన డేటాను లెక్కించి, దాని విలువను బట్టి తదుపరి నెల రీఛార్జ్ మొత్తం తగ్గింపు ఇవ్వాలని చద్దా ప్రతిపాదించారు. ఇది వినియోగదారుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని అన్నారు. డేటా బదిలీ అవకాశం: డేటాను వినియోగదారుడి డిజిటల్ ఆస్తిగా భావించాలని రాఘవ్ చద్దా ఒక వినూత్న ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. మనం బ్యాంకు నుంచి డబ్బులను ఇతరులకు పంపినట్టుగానే మన దగ్గర మిగిలిపోయిన డేటాను స్నేహితులకు, లేదా బంధువులకు బదిలీ చేసుకునే వెసులుబాటు ఉండాలని కోరారు. భారత్ డిజిటల్ ఇండియా దిశగా వేగంగా అడుగులు వేస్తున్న టైంలో డిజిటల్ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలని అదే సమయంలో అవి పారదర్శకంగా ఉండాలని చద్దా పేర్కొన్నారు. మీరు ఒక వస్తువు కోసం డబ్బు చెల్లిస్తే అది మీ ఆస్తి అవుతుంది. అది వాడినా వాడకపోయినా మీకే చెందాలి. డేటా విషయంలో కూడా ఇదే సూత్రం వర్తించాలి అన్నారు. కేవలం డేటా మాయమైపోవడం వల్ల టెలికాం కంపెనీలు కోట్లాది రూపాయల లాభాలను గడిస్తున్నాయని, ఇది వినియోగదారులను వంచించడమేనని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని, వినియోగదారులకు అనుకూలమైన టెలికాం విధానాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభలో పేర్కొన్నారు. వాడని డేటాకు సర్దుబాటు:వినియోగదారులు నిరంతరం తక్కువ డేటా వాడితే, మిగిలిన డేటా విలువను తదుపరి రీచార్జ్‌లో తగ్గింపు రూపంలో ఇవ్వాలని సూచించారు.వాడని డేటాను కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు పంపుకునే విధానం ఉండాలని పేర్కొన్నారు. డేటాను వినియోగదారుల "డిజిటల్ ఆస్తి"గా పరిగణించాలి అన్నారు

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
25.03.2026

# రాయల్ ఎయిర్‌ఫోర్స్ పైలట్లకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బోధకుల ద్వారా శిక్షణ



యేచన్ చంద్ర శేఖర్
8885050822

ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయి అన్న సామెత మనకు తెలిసిందే. ఇటీవల భారత్ మరియు బ్రిటన్ మధ్య కుదిరిన తాజా ఒప్పందాన్ని ఈ సామెతకు ఒక చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఒకనాడు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంగా వెలుగొంది, భారతదేశాన్ని దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు పాలించిన బ్రిటిష్ దేశపు వాయుదళం రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) పైలట్లకు భారత వైమానిక దళం (ఐఏఎఫ్) యొక్క ముగ్గురు అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌లను (క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌లు) శిక్షణార్థం పంపనుంది. అయితే, భారతదేశపు మొట్టమొదటి తరం సైనిక పైలట్‌లకు రాయల్ ఎయిర్ ఫోర్స్ శిక్షణ ఇచ్చిన దాదాపు ఒక శతాబ్దం తర్వాత, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బోధకులు ఇప్పుడు ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ ఫాస్ట్‌జెట్ ట్రైనీలకు శిక్షణ ఇవ్వనుండడం విశేషం. బ్రిటన్‌లోని ఆర్‌ఏఎఫ్ వ్యాలీ ఫాస్ట్ జెట్ పైలట్‌లకు శిక్షణా స్థావరం. "మొదటిసారిగా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ బోధకులు యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఆర్‌ఏఎఫ్ ఫాస్ట్‌జెట్ పైలట్‌లకు శిక్షణ ఇస్తారు" అని బ్రిటిష్ హైకమిషన్‌లోని రక్షణ సలహాదారు రాయల్ నేవీ కమోడోర్ క్రిస్ సాండర్స్ ఎంబిఇ (మెంబర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సిలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్) అన్నారు. ఫిబ్రవరి 12న న్యూఢిల్లీలో జరిగిన 19వ యుకెఇండియా ఎయిర్ స్టాఫ్ చర్చలలో ఈ సహకారంపై ఇరు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయి.

**ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ పైలట్‌లకు ఫాస్ట్ జెట్ శిక్షణ:** ముగ్గురు భారతీయ అర్హత కలిగిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌లు ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ పైలట్‌లకు ఫాస్ట్ జెట్ శిక్షణ ఇవ్వడం ఇదే మొదటిసారి. ప్రారంభంలో ఈ ఏర్పాటు రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటుంది. తదుపరి తరం ఆర్‌ఏఎఫ్ అధికారులకు శిక్షణ ఇచ్చే ఎయిర్ అకాడమీ అయిన రాయల్ ఎయిర్ ఫోర్స్ కాలేజ్ క్రాన్‌వెల్‌కు ఈ సంవత్సరం జనవరిలో మొదటిసారి బోధకుడిగా ఒక భారతీయ వైమానిక దళ అధికారి నియామకానికి కొనసాగింపుగా చేపట్టిన చర్య. దీనితో మూడు బ్రిటిష్ సైనిక అకాడమీలు ఇప్పుడు సంబంధిత సేవల నుండి బోధకులుగా భారతీయ అధికారుల సేవలను వినియోగించుకుంటున్నాయి. ఎయిర్ స్టాఫ్ అసిస్టెంట్ చీఫ్ ఎయిర్ వైస్ మార్షల్ ఇయాన్ టౌన్సెండ్ మాట్లాడుతూ రాయల్ ఎయిర్ ఫోర్స్ మరియు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మధ్య దీర్ఘకాల సంబంధాన్ని బలోపేతం చేయడంలో ఈ ఒప్పంద లేఖపై సంతకం చేయడం ఒక ముఖ్యమైన అడుగు అని అన్నారు. భారతీయ క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌లను యుకె మిలిటరీ విమాన శిక్షణ వ్యవస్థలోకి తీసుకురావడం ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం, సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సిబ్బంది శిక్షణలో రాణించడానికి మా భాగస్వామ్య నిబద్ధతను బలోపేతం చేస్తుంది అని అభిప్రాయపడ్డారు. యాంగిల్సీలోని ఆర్‌ఏఎఫ్ వ్యాలీ నెం. 4 ఫ్లయింగ్ ట్రైనింగ్ స్కూల్‌కు నిలయంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పర్వత మరియు సముద్ర కార్యకలాపాల కోసం కూడా ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో విమాన సిబ్బందికి శిక్షణ ఇస్తారు.

**భారత్-యూకే సహకారం:**

2023లో, భారత వైమానిక దళం యూకే యొక్క బహుళ పక్ష వాయు విన్యాసం కోబ్రా వారియర్‌లో మొదటిసారిగా పాల్గొంది. కాగా 2024లో, ఐఏఎఫ్ యొక్క మొదటి బహుళపక్ష వాయు యుద్ధ విన్యాసం తరంగ్ శక్తిలో పాల్గొన్న వారిలో రాయల్ ఎయిర్ ఫోర్స్ కూడా ఒకటి. మే 2024 నుండి భారత నావికాదళానికి చెందిన ఒక అధికారి బ్రిటానియా రాయల్ నేవల్ కాలేజ్ డార్ట్‌మౌత్‌లో శిక్షకుడిగా



సేవలందిస్తున్నారు. దీనికి కొనసాగింపుగా మే 2025లో రాయల్ మిలిటరీ అకాడమీ శాండ్‌హర్స్ట్‌కు మరొక భారత సైనిక అధికారిని శిక్షకుడిగా నియమించారు. దీంతో ఇప్పుడు మూడు బ్రిటిష్ సైనిక అకాడమీలు తమ తమ విభాగాలలో శిక్షకులుగా భారతీయ అధికారుల సేవలను వినియోగించుకుంటున్నాయి. అంతేకాదు, 2025లో యూకే మరియు భారతదేశం తమ నౌకాదళాలకు చెందిన క్యారియర్ స్ట్రైక్ గ్రూపులను ఉపయోగించి, ఇప్పటివరకు జరిగిన వాటిలోకెల్లా అతిపెద్ద సముద్ర విన్యాసాన్ని నిర్వహించాయి. తదుపరి భారతదేశం మరియు యూకే సంయుక్తంగా 8వ విడత సైనిక విన్యాసాలను "అజేయ వారియర్" పేరుతో నవంబర్ 17 నుండి నవంబర్ 30, 2025 వరకు రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో నిర్వహించాయి. సబర్బన్ ప్రాంతాలలో ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలపై దృష్టి సారించిన ఈ విన్యాసంలో, భారత సైన్యం మరియు బ్రిటిష్ సైన్యానికి చెందిన మొత్తం 240 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఎయిర్ స్టాఫ్ భేటీ వార్షిక సమావేశాలలో ఒక భాగం. ఇందులో సాధారణంగా ఇరుపక్షాల తరపున ఒక రెండు నక్షత్రాలు (టూస్టార్) లేదా అంతకంటే పై స్థాయి అధికారి పాల్గొని, పరస్పర సైనిక సహకార రంగాలపై చర్చిస్తారు. ఈ అధికారుల భేటీ 2025లో లండన్‌లో జరిగింది.

**చారిత్రాత్మక ప్రాముఖ్యత:** సంఖ్యాపరంగా చూస్తే, ముగ్గురు భారత వాయు దళ శిక్షకులు ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో బ్రిటిష్ పైలట్‌లకు శిక్షణ ఇచ్చేందుకు నియమించబడడం పెద్ద విషయంగా అనిపించకపోవచ్చు. మిత్ర దేశాల వైమానిక దళాల మధ్య ఇటువంటి తాత్కాలిక నియామకాలు అసాధారణమేమీ కాదు. అయితే, ఈ పరిణామానికి చారిత్రక ప్రాముఖ్యత ఉంది. 1932లో భారత వైమానిక దళం స్థాపించబడినప్పుడు, అది శిక్షణ మరియు బోధనా పర్యవేక్షణ కోసం పూర్తిగా రాయల్ ఎయిర్ ఫోర్స్‌పై ఆధారపడింది. ప్రారంభ కోర్సులు పూర్తిగా యునైటెడ్ కింగ్‌డమ్‌లో నిర్వహించబడేవి. శిక్షణా కార్యకలాపాలు భారతదేశానికి తరలిన తర్వాత కూడా, ఫ్లయింగ్ స్కూళ్లలో ఆర్‌ఏఎఫ్ శిక్షకులే ఆధిపత్యం కొనసాగేది. భారతదేశపు సొంత బోధనా సిబ్బందిని విస్తరించడానికి 1940 ప్రారంభంలో ఉత్తర భారతదేశంలోని అంబాలా పట్టణంలో ఒక సెంట్రల్ ఫ్లయింగ్ స్కూల్ స్థాపించబడింది. అయినప్పటికీ, 1946 జనవరి వరకు దాదాపు 90 శాతం మంది బోధకులు ఆర్‌ఏఎఫ్ సిబ్బంది ఉండేవారు. ఆపరేషనల్ స్క్వాడ్రన్‌లలో భారతీయ అధికారుల అవసరం అత్యవసరంగా ఉండటంతో, బోధనా పాత్రల కోసం అందుబాటులో ఉండే వారి సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. 1940 దశకం మధ్యకాలం నుండి, భారతీయ అధికారులు ఫ్లయింగ్ బోధకులుగా అర్హత సాధించడానికి యూకేకి వెళ్లి, ఆ తర్వాత దేశీయ సామర్థ్యాన్ని పెంపొందించడానికి తిరిగి వచ్చేవారు. ఆర్‌ఏఎఫ్ పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చేపట్టిన ఉద్దేశపూర్వక ప్రయత్నాలలో భాగంగా, 1946 మరియు 1952 మధ్య, దాదాపు 90 మంది భారతీయ అధికారులు యూకే సెంట్రల్ ఫ్లయింగ్ స్కూల్ కోర్సుల నుండి పట్టభద్రులయ్యారు. 1948లో, భారతదేశం అంబాలాలో తన సొంత ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ స్కూల్‌ను స్థాపించి, తరువాత 1954లో దానిని తమిళనాడులోని తాంబరానికి మార్చింది. ఈ సంస్థ దశాబ్దాలుగా, 150కి పైగా కోర్సులు నిర్వహించడం ద్వారా 3,000 మందికి పైగా శిక్షకులను తయారు చేసింది. దీంతో భారత వాయుసేన (ఐఏఎఫ్) పూర్తిగా స్వయం సమృద్ధి గల శిక్షణ వ్యవస్థను రూపొందించుకుంది. ఒక రక్షణ విశ్లేషకుడి ప్రకారం, 1956 నుండి భారత వైమానిక దళం ఈజిప్ట్, ఇరాక్, ఘనా, నైజీరియా, సింగపూర్ మరియు ఇండోనేషియా వంటి దేశాల్లోని శిక్షణా సంస్థలకు మద్దతుగా, శిక్షకులను విదేశాలకు పంపడం ప్రారంభించింది. ఈ నియామకాలు భారతీయ బోధనా ప్రమాణాలు మరియు వృత్తిపరమైన నైపుణ్యంపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించాయి.

**శిక్షణ పొందిన చోటనే శిక్షణ ఇవ్వడం:** గతంలో యుద్ధ విమానాలు నడపడం కోసం ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో శిక్షణ పొందిన భారత వాయుసేనకు చెందిన పైలట్లు, ఇప్పుడు ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో అదే బ్రిటిష్ సైనికులకు ఆర్‌ఏఎఫ్ వ్యాలీలో బోధించడం అనేది ఒక సాధారణమైన పరిణామం కాదని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు. అయితే, ఇది పూర్వపు ఆధారపడటాన్ని తిప్పికొట్టడమే. ఒకప్పుడు ఆర్‌ఏఎఫ్ శిక్షకులపై ఆధారపడిన ఈ విభాగం, ఇప్పుడు బ్రిటన్ యొక్క సొంత అధునాతన జెట్ పైప్‌లైన్‌లోని శిక్షణకు తన వంతు సహకారం అందించడం భారతీయులుగా మనమందరం గర్వించదగ్గ పరిణామం.

# తెలంగాణలో 'అసలైన ప్రతిపక్షం' కవితనేనా!



డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం
9618473996

తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు అప్పుడే సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి. పోటాపోటీ కార్యక్రమాలు..ఘాటైన విమర్శలు ఆరోపణలతో వేడెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పాలనలో డొల్లతనాన్ని విమర్శించే ప్రతిపక్షం ఉన్నట్టా.. లేనట్టా అన్నట్లుగా ఉంది. ప్రజాభీష్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాలకులను అడ్డుకునే దిశగా సమర్థవంతంగా పనిచేయని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతున్నది. పాలక పక్షానికి ధీటుగా ప్రజా సమస్యల పరిష్కార సాధనకు తర్కబద్ధమైన, విభిన్న ఆలోచన సరళితో అనూహ్యంగా తనదైన పోరాట శైలితో కల్వకుంట్ల కవిత తెరపైకి వచ్చారు. ఏ ప్రాంతమైతే అణిచివేతకు గురవుతుందో.. ఏ ప్రాంతమైతే అన్యాయానికి బలవుతుందో, ఏ ప్రాంతమైతే దోపిడికి విలవిలలాడుతుందో అక్కడ తెలంగాణ జాగృతి పురుడు పోసుకొని ఆ ప్రాంత సమస్యలను తన భుజంపైన వేసుకుంటున్నది. ఆ సమస్యలకు సరైన పరిష్కారం లభించేంత వరకు పోరాటం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసలైన ప్రతిపక్షం కవితనేనా అన్నట్లుగా మూమెంట్ లీడర్ గా ప్రజల్లో నిలుస్తూ చర్చల్లో నిలుస్తున్నారు

**దూకుడు పెంచుతున్న కవిత**

ఐయాం వాయిస్ ఆఫ్ వాయిస్ లేస్.. ప్రజల గొంతుకగా నిలబడతా, ఎప్పుడో ఒకసారి తెలంగాణకు ముఖ్యమంత్రి అయి తీరుతా..అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్టేట్మెంట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీనుండి సస్పెండైన దగ్గర నుండి ప్రత్యేక ఎజెండాతో ముందుకు వెళ్తున్న కవిత ఓవైపు పార్టీ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తూనే, అసలు సిసలు ప్రణాళిక అమలు చేస్తున్నారు. పరిస్థితులను బట్టి పొలిటికల్ ఈక్వేషన్స్ బేరీజు వేసుకుని ప్రజాసమస్యలపై ఫోకస్ పెట్టారు. వరుస కార్యక్రమాలు, మెరుపు ధర్నాలు, దీక్షలతో అధికార కాంగ్రెస్ తీరుపై నిరసన తెలుపుతూనే ఇటు బీఆర్ఎస్ బీజేపీలపై విమర్శల దాడిని కంటిన్యూ చేస్తున్నారు. ఓ రకంగా తానే అసలైన ప్రతిపక్షంగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నారు కవిత. త్వరలోనే రాజకీయ పార్టీని ప్రకటించేందుకు రెడీ అవుతున్న కవిత అంతలోపే అంశాల వారిగా తనదైన శైలిలో పోరాటం మొదలు పెట్టారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మొదలు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ సమస్యలున్నా అక్కడికి వెళ్తున్నారు. అంశాల బట్టి నిరసనలు, ధర్నాలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇక సమస్య తీవ్రతను బట్టి మెరుపు దీక్షలు, చివరికి నిరవధిక నిరాహార దీక్షకు కూడా దిగడంతో కవిత రాజకీయ వ్యూహంపై ఆసక్తికరమైన



చర్చ మొదలైంది.

**వెలుగుమట్ల దీక్ష**

హైదరాబాదులో మూసీ పక్కన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమ నిర్మాణంపై కల్వకుంట్ల కవిత మెరుపు ధర్నాలతో నిరసన తెలిపారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చినట్లుగా మహిళలకు రూ. 2500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ ముందు ధర్నా నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి రైతుల సమస్యలపై కలెక్టరేట్ దగ్గర నిరసన తెలిపారు. రైతు సంఘర్షణ సభ తర్వాత కలెక్టరేట్ కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపి అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. తాజాగా ఖమ్మం వెలుగుమట్ల బాధితుల తరఫున కవిత ఏకంగా నిరవధిక నిరాహారదీక్ష చేయడం పొలిటికల్ హాట్ టాపిక్కైంది. ప్రభుత్వం వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో నివసిస్తున్న పేదల ఇండ్లు కూల్చడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన కవిత మళ్లీ అక్కడే వాళ్లకు ఇండ్లు కట్టించి ఇవ్వాలన్న డిమాండ్ చేశారు. ఖమ్మంలో దీక్ష చేస్తున్న కవితను పోలీసులు హైదరాబాద్ తరలించినా దీక్షను కొనసాగించారు. చివరికి ప్రభుత్వం వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల పట్టాలు ఇవ్వడంతో మూడు రోజుల నిరవధిక దీక్షను విరమించారు. ఇంతటితో ఆగకుండా వెలుగుమట్ల బాధితుల న్యాయం కోసం 12 మంది నిపుణులతో ఫ్యాక్ట్ ఫైండింగ్ (నిజ నిర్ధారణ కమిటీ) వేసి వెలుగుమట్ల బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు.

**ప్రజా బడ్జెట్ ప్రతిపాదన**

ఉగాది వేడుకల సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కవిత రూ.2,15,200 కోట్లతో తెలంగాణ జాగృతి ప్రజా బడ్జెట్ 2026-27ను విడుదల చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ లో జాగృతి ప్రజా బడ్జెట్ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని కవిత తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. కానీ రాష్ట్రప్రభుత్వం మార్చి 20 న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ తలా, తోక లేకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. ఇది ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్ అని కవిత మండిపడ్డారు. ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీ మాత్రం తెలంగాణ ప్రజలను ఏడిపిస్తున్నారు అని మండిపడ్డారు. స్త్రీనిధి పేరుతో తెలంగాణ ఆడబిడ్డల సొమ్మును దోచుకోవడమే కాకుండా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అన్నింటికి మించిన ఫేక్ అని ప్రభుత్వం పైన ధ్వజమెత్తారు కవిత. ఇలా వరుసగా ప్రజాసమస్యలపై పోరాటాలు, దీక్షలు, విమర్శలు చేయడం వెనుక ఆమె రాజకీయ వ్యూహం ఏమై ఉంటుందన్న చర్చ మొదలైంది. వచ్చేనెలలో రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న కవిత అంతకుముందే తనకు తాను నిరూపించుకోవాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది.

**ప్రధాన ప్రతిపక్ష పాత్ర**

దశాబ్దాలుగా కళలను నమ్ముకుని బతుకుతున్న తెలంగాణ కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు ఇప్పించేందుకు జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత చేసిన కృషి ఫలించింది. కవిత డిమాండును మన్నించిన ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు ఇవ్వడానికి ఉత్తర్వులు జారీ చేసింది. కవిత చేపడుతున్న కార్యక్రమాలు రాష్ట్రంలో విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను వెనక్కినెట్టి తాను ప్రధాన ప్రతిపక్ష పాత్ర నిర్వహిస్తున్నట్లు జనం భావించే స్థాయికి ఎదిగారు. రాజకీయ పార్టీ పెట్టాక మరింత దూకుడు పెంచి బీఆర్ఎస్, బీజేపీకి ప్రత్యామ్నాయం అయ్యేలా వ్యూహం అమలు చేస్తున్నారు. తెలంగాణ పొలిటికల్ సినేరియాలో కవిత ఫ్లాన్స్ క్రిటికల్, లాజికల్, థింకింగ్ తో అసలు సిసలైన అతి తక్కువ సమయంలోనే ప్రతిపక్ష హోదాను కవిత సంపాదించగలిగారని మేధావి వర్గంలో హాట్ టాపిక్ గా నడుస్తున్నది.

**(వ్యాస కర్త అధ్యాపకులు, కాకతీయ యూనివర్సిటీ)**

# అగ్రకులాల ఆధిపత్యమే

## దళిత ఎమ్మెల్యే మందుల సామేల్ పై దాడి



సంపతి రమేష్
7989579428

భారతదేశ సమాజాన్ని అర్థం చేసుకోవాలంటే కుల వ్యవస్థను విమర్శనాత్మకంగా పరిశీలించాల్సిందే. చరిత్ర చెబుతున్న నిజం ఏంటంటే—కుల వివక్ష అనేది కేవలం ఒక సామాజిక విభజన కాదు, అది అణగారిన వర్గాలపై వ్యవస్థాగతంగా అమలైన అణచివేత. శతాబ్దాలుగా బీసీ ఎస్సీ ఎస్టీ లు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడ్డారు. వారికి కనీస మానవ గౌరవం నిరాకరించబడింది. అస్పృశ్యత, అంటరానితనం వంటి అమానుష శిక్షలు వారి పాలిట శాపంగా మారాయి. ఈ అన్యాయాన్ని మొదట బహిరంగంగా సవాలు చేసినవారిలో జ్యోతిరావ్ పూలే ప్రముఖుడు. బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో ఆయనకు జరిగిన అవమానమే ఇందుకు కారణం. ఆయన కులవివక్షతను విద్య, సామాజిక చైతన్యంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చాడు. పూలేను గురువుగా స్వీకరించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితమే కుల వ్యవస్థపై తిరుగుబాటు. ప్రపంచ స్థాయి విద్యను అభ్యసించినప్పటికీ, ఆయనను బరోడా మహారాజు ఆస్థానంలో కిందిస్థాయి ఉద్యోగస్తులు ఎంతో అవమానించారు. అనాడు పూలే, అంబేద్కర్ లకు జరిగిన అవమానాలు, దాడులు బీసీ ఎస్సీ ఎస్టీ కులాల పట్ల వివక్షకు సాక్ష్యాలు. అయితే వారికి ఎన్ని అవమానాలు ఎదురైన వెనక్కి తగ్గలేదు. ప్రశ్నించారు, సమాజాన్ని చైతన్యపరిచారు. సమానత్వం, మానవ హక్కుల కోసం తమ జీవితాన్ని అంకితం చేశారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చాక కోట్లాది ప్రజలకు విముక్తి లభించింది. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం—ఇవన్నీ వారి చైతన్యాన్ని పెంచాయి. ఇప్పుడు అట్టడుగు కులాల అణచివేత వెనుక ఉన్న మూలాల్ని ప్రశ్నిస్తున్నారు."ఎందుకు మనపై వివక్ష?" అని గట్టిగా అడుగుతున్నారు. కానీ ఈ ప్రశ్నలే అగ్రకుల ఆధిపత్యానికి ముప్పుగా కనిపిస్తున్నాయి. అందుకే హింసతో కూడిన ప్రతి ఘటన జరుగుతోంది. ఇటీవల మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే మందుల సామెల్ పై జరిగిన దాడి ఈ వాస్తవానికి తాజా నిదర్శనం.

**కుల ఆధిపత్యమే దాడులకు కారణం**

తెలంగాణలో తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే మందుల సామెల్ ఓ సభలో తనకు అర్థం కానీ సంస్కృత భాషపై అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు, ఓ అగ్రకులవర్గం, అగ్రకులాలకు కొమ్ముకాస్తున్న సంస్థలు, పార్టీ అతని ఇంటిపై దాడి చేసింది. ఆయన తన మాటలను వెనక్కి తీసుకున్నప్పటికీ దాడులు ఆగకపోవడం, ఇదీ అభిప్రాయ స్వేచ్ఛను అణిచివేయడమే కాకుండా, అణగారిన వర్గాల స్వరాన్ని భయపెట్టే చర్య. అసలు చట్ట వ్యతిరేక పనులు చేస్తే పిర్యాదు చేయాలి. కానీ అటవికంగా దాడులకు దిగడం కుల ఆధిపత్యానికి నిదర్శనం. వాస్తవంగా వేల ఏళ్లుగా విద్యకు, సంపదకు, గౌరవానికి దూరమైన బీసీ ఎస్సీ ఎస్టీలకు సంస్కృత భాష రాదనేది జగద్విదితం. ఆ భాషను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడిన మాటల్లో కొన్ని పొరపాట్లు దొర్లి ఉండవచ్చు, ఈ వాక్యాలను వెనక్కి తీసుకున్నప్పటికీ దాడులకు దిగడం ఎంతవరకు సమంజసం అని మేధావుల చర్చ. అనేక దేవతలను కించపరచి మాట్లాడిన సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ, రామునిపై వివాదాస్పద వాక్యాలు చేసిన ప్రముఖ లాయర్ రాంజెత్మలానీపై ఎలాంటి దాడులు చేయలేదు. గతంలో చిన్న జీయర్ స్వామి సమ్మక్క-సారక్కలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ప్రవచనకర్త గరికపాటి ప్రభుత్వ పాఠశాల పిల్లలకు గుడ్డు ఇవ్వడంపై ప్రశ్నిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అవమానించినట్లు మాట్లాడారు. అగ్రకులాలకు చెందిన వీళ్లలో ఎవరూ కూడా క్షమాపణ చెప్పలేదు. అయినా వారిపై దాడికి దిగలేదు. ఎమ్మెల్యే సామెల్ వాక్యాలపై ఓ టీవీలో జరిగిన చర్చ గోష్టిలో మధ్యవర్తిగా ఉండాల్సిన ఓ యాంకర్ సైతం ఎమ్మెల్యే ను కులదురాకారంతో దుర్భాషలాడాడు. అతనిపై ఎస్సీ, ఎస్టీ చట్టం ఎందుకు వర్తించదని విశ్లేషకులు అనుకుంటున్నారు. ఇవన్నీ గమనిస్తే... భారతదేశంలో వివాదాస్పద అంశాల్లో సైతం సమాజ స్పందన కులాన్ని బట్టి ఉంటుందనేది నిర్వివాదాంశం. దళిత ఎమ్మెల్యేకే ఇలాంటి దుస్థితి ఎదురైతే సామాన్యులైన బీసీ ఎస్సీ ఎస్టీల పరిస్థితి ఏంటనేది మేధావులు ప్రశ్న. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పు.

**రచయితలకు మనవి**

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

**రచనలు పంపాల్సిన చిరునామా**

ppbahula@gmail.com
99121 99844

**ADRESS**
Editor,
Prathipaksham,
Telugu Daily
# 8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 24 :** పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్ చెరు ఎమ్మెల్యే , రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు పట్టణ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాగనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని రేషన్ డీలర్ల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ కు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి 24:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం నిర్లక్ష్యం వహిస్తుందని పెద్దపెల్లి నియోజకవర్గ ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి భారీగా నిధులను సమకూరుస్తున్నప్పటికీ రాష్ట్రానికి వారిచ్చే నిధులు రూపాయికి 30 పైసలు మాత్రమే అన్నారు. ఇది తెలంగాణ జరుగుతున్న తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపెల్లి నియోజకవర్గం దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉందని వివరించారు. ఎన్ టి పి సి ఆర్ఎఫ్సిఎల్ సింగరేణి వంటి సంస్థల ద్వారా ఏడాదికి సుమారు రూపాయలు 25 వేల కోట్ల నుంచి 30 వేల కోట్ల వరకు కేంద్రానికి ఆదాయం సమకూర్తుందని చెప్పారు. అయినప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధి కేటాయిస్తున్న నిధులు కేవలం రూపాయలు ఏడాదికి 100 నుంచి రూపాయలు 150 కోట్లు మాత్రమే అని విచారం వ్యక్తం చేశారు. ప్రాంత అభివృద్ధి కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయ గనుల విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినట్టు తెలిపారు. అదేవిధంగా సింగరేణి కార్మికుల కోసం ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులకు ఇప్పటివరకు కేంద్రం నుంచి సరైన స్పందన లేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# సురేష్ నాయి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 24:** నాయి బ్రాహ్మణ సంఘానికి చెందిన సురేష్ ఇటీవల మరణించగా నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు సురేష్ కుటుంబాన్ని పరమ నించి ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో కూడా సురేష్ కుటుంబానికి సంఘం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నా ఈ బ్రాహ్మణ సంఘ నాయకులు రాజు పెద్ద మంగళారం నరసింహ, అప్ప రెడ్డిగూడెం శీను, సుధాకర్, కనకమామిడి మంగళ్ శీను, మేడిపల్లి సాయి పాల్గొన్నారు.



# ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- చేవెళ్ల సర్కిల్ ఇన్ స్పెక్టర్ భూపాల్ శ్రీధర్

**ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 24 :** విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా చదివి, ఉన్నత లక్ష్యాలను జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని చేవెళ్ల సర్కిల్ ఇన్ స్పెక్టర్ భూపాల్ శ్రీధర్ తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్ చేవెళ్లలో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ ని మంగళవారం సర్కిల్ ఇన్ స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, సబ్ ఇన్స్పెక్టర్ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్కౌట్స్ మరియు గైడ్స్ కార్యక్రమాలతో విద్యార్థులలో ఉన్నత నైతిక విలువలను, క్రమశిక్షణను పెంపొందించి, వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది, జాతీయ ఐక్యతను పెంపొందించడంలో సహాయపడతాయని "ఈ రోజుల్లో చాలా మంది యువకులు ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారుని స్కౌట్ మరియు గైడ్ లో చేరడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంపొందిస్తుంది," అని ఆయన అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువులో రాణించడంతో పాటు సహ పాఠ్య కార్యకలాపాలలో పాల్గొనాలని, తల్లిదండ్రుల మాట వినాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ వినోద్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నీరు జీవాధారం.. పొదుపు అందరి బాధ్యత

- 'వాటర్ ఎయిడ్' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- నీటిని ఆదా చేయడం అంటే జీవితాన్ని కాపాడుకోవడమే.
- మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్

**ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 24:** భూమిపై సమస్త ప్రాణికోటి మనుగడకు నీరే ఆధురమని, పెరుగుతున్న జనాభా, కాలుష్యం దృష్ట్యా ప్రతి చుక్కను పొదుపుగా వాడుకోవాలని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో 'వాటర్ ఎయిడ్' సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'సేవ్ వాటర్' అంశంపై చిత్రలేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించి వారిలో చైతన్యం నింపారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ.. "నీటిని ఆదా చేయడం అంటే మన జీవితాన్ని మనం కాపాడుకోవడమే" అని పేర్కొన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవాలని సూచించారు. పైపుల లీకేజీలను అరికట్టాలని, ప్రతి డ్రాప్‌ను పొదుపుగా వాడటం ద్వారానే భవిష్యత్ తరాలకు నీటిని అందించగలమని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దమంగాలారం మాజీ సర్పంచ్ రామకృష్ణ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 24 :** క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని నగర మేయర్ కె. ఉమా రాణి అన్నారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం, వైద్యులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని మేయర్ పిలుపునిచ్చారు. ఎస్ వీ కెన్ ఎండ్ టీబీ లెడ్ బై కంట్రీస్, పవర్డ్ బై పీపుల్ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డా. విషాల్, ప్రధాన కార్యదర్శి డా. డి. హరీష్‌స్వామి, కోశాధికారి డా. కె. రమణేశ్వర్ డా. కె. శ్రీశైలం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు
- విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 24 :** నేత్ర సమస్యలను అశ్రద్ధ చేయకూడదని, శరీర అవయవాలలో అత్యంత ప్రధానమైన కంటి చూపును ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బోర్గాం(పి) ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి బాలబాలికలకు కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కంటి చూపు మందగించకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఆకు కూరలు, క్యారెట్ వంటి వాటిని ఆహార పదార్థాలలో భాగం చేసుకోవాలని సూచించారు. ఇదివరకు తాను కూడా దృష్టి లోపంతో ఇబ్బందిపడ్డానని, తగిన వ్యాయామాలు, సరైన ఆహారపు అలవాట్లతో ఆ సమస్యను అధిగమించానని కలెక్టర్ వెల్లడించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు వీలుగా జిల్లాలో సుమారు 70 వేల మంది వరకు విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 41 వేల మందికి కంటి పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగానే అవసరం అయిన వారికి అంధత్వ నివారణ సంస్థ ద్వారా ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నేత్ర పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. చూపు మందగించిన వారు రెగ్యులర్ గా కంటి అద్దాలను వినియోగిస్తూ సరైన పోషక ఆహారం తీసుకుంటే దృష్టి లోపం సమస్య నుండి బయటపడవచ్చని అన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని శరీరం డీహైడ్రేట్ కాకుండా అధిక మోతాదులో తాగునీటిని వినియోగించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కంటి సంబంధిత సమస్యలకు సంబంధించిన అంశాలపై విద్యార్థిని, విద్యార్థులకు పలు ప్రశ్నలు వేస్తూ, సరైన సమాధానాలు చెప్పిన వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అశ్విని, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ పీ.ఓ డాక్టర్ సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజ్మల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 24:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బూర్గుల నవీన్ కుమార్ తన నాయనమ్మ వెంకటమ్మ జ్ఞాపకార్థంగా ఎన్ పి ఎల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా.. గ్రామ సర్పంచ్ బండారి లింగం, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, మాజీ ఉపసర్పంచ్ లతీఫ్ ఖాన్, వార్డు సభ్యులు నయీంఖాన్, గణపురం మహేందర్, మరియు తోట్ల నరసింహ, శరత్ రెడ్డి, శ్రీ పాల్ రెడ్డి, సత్యం స్కూల్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, బూర్గుల రాజు, జెల్లా బాల్ రాజ్, యాదగిరి నరసింహ ఆయిలా మహిపాల్ గౌడ్, మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్టుగా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బూర్గుల నవీన్ కుమార్ తెలియజేశారు.



# పెద్దమంగళారం కుంటకు మహర్దశ

- వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దుతాం!
- పారిశుధ్యంపై మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 24 :** మొయినాబాద్ మున్సిపాలిటీ 18వ వార్డు (పెద్దమంగాలారం)లో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ మంగళవారం పర్యటించారు. స్థానిక నాయకుడు చేగురి రామకృష్ణ గౌడ్ సమక్షంలో గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నీటి కుంటను పరిశీలించిన కమిషనర్.. అందులో ఉన్న గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించి, వాకింగ్ ట్రాక్ మరియు వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ధనరాజ్ గౌడ్, వీరస్వామి గౌడ్, విజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# స్కూల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తప్పవు

- కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక
- కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- పారిశుద్ధ్య పనుల ఫోటోలు పంపాలని ఆదేశం
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

**ప్రతిపక్షం ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, మార్చి 24:** పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి... తక్షణం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మహా ముత్తారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరిశుభ్రతగా ఉంటే పరిసరాల్లోకి విష జంతువులు వచ్చే అవకాశం ఉన్నందున, విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా పరిశుభ్రంగా మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చేపట్టిన పారిశుద్ధ్య పనుల ఫోటోలను తనకు పంపించాలని సూచించారు. అదనంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతూ పచ్చదనం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వెళ్లే రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మరియు విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి, బుధవారం నుండి పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంచినీటి సరఫరా విషయమై మిషన్ భగీరథ అధికారులు పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం, జిల్లా కలెక్టర్ 10వ తరగతి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. హలో స్టూడెంట్స్... ఎలా ఉన్నారు? ఇప్పటి వరకు ఎన్ని పరీక్షలు వ్రాసారు? ఇంకా ఎన్ని పరీక్షలు మిగిలి ఉన్నాయి?" అని అడిగి తెలుసు కున్నారు. మిగిలిన పరీక్షలను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ ప్రకాష్, సర్పంచ్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.




# ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు : అదనపు కలెక్టర్

**ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 24:** ఏప్రిల్ 1 నుండి దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడానికి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. రాబోయే రబీ మార్కెటింగ్ సీజన్ 2025-26కు సంబంధించిన ప్యాడి కొనుగోలు ఎంట్రీల పై జిల్లా స్థాయి అవగాహన , శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన అధ్యక్షత వహించగా, ఈ ఈ కార్యక్రమంలో పీఏసీఎస్, ఐకేపీ వంటి కొనుగోలు సంస్థలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి PPC లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుట పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడి క్లీనర్లు , ఇతర అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. యాప్ రైతుల వివరాలు సరిగా, తక్షణం నమోదు చేయడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం, నాణ్యత ప్రమాణాలు , తేమ శాతం పాటించడం, ప్రభుత్వ కొనుగోలు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం పై విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, సమయపాలన తో కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం రెండు సెషన్లలో ఉదయం సెషన్ కామారెడ్డి ,ఎల్లారెడ్డి నియోజకవర్గాలు, మధ్యాహ్నం సెషన్ బాన్సువాడ , జుక్కల్ నియోజకవర్గాల వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా సహకార అధికారి , జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, జిల్లా మేనేజర్ పాల్గొన్నారు.



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి తనకు కాల్ వచ్చింది. పశ్చిమాసియాలో పరిస్థితులపై చర్చించాం. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారత్ మద్దతు ఇస్తుంది. హార్ముజ్ జలసంధిని తెరిచి, అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరం. శాంతి, స్థిరత్వం దిశగా జరుగుతున్న ప్రయత్నాలపై సంప్రదింపులు కొనసాగిస్తాం.

- ప్రధాని నరేంద్ర మోడీ



ప్రాంతీయం



## భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో
# తహసిల్దార్లకు చిత్తశుద్ధి అవసరం

- **రెవెన్యూ శాఖలో పారదర్శక పాలనకు కట్టుబాటు కావాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 24:** మెదక్ జిల్లాలో భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో తహసిల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నుండి భూ భారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ జాబితా తయారీ, ఇతర రెవెన్యూ అంశాలపై గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని తహసిల్దార్లకు సూచించారు.రెవెన్యూ శాఖలో పారదర్శక పాలన కోసం ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి మరియు భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న అన్ని దరఖాస్తులను శాశ్వతంగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు.ఓటర్ జాబితా తయారీ ప్రక్రియను అన్ని శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్వతంత్ర నిర్ణయాలకు తావు లేదని స్పష్టం చేశారు.ఈ గూగుల్ మీట్ లో ఆర్డీవోలు, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- **60 టన్నుల ఇసుక సీజ్ – సాండ్ బజార్‌కు తరలింపు**

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 24:** మెదక్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై రెవిన్యూ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్, రెవిన్యూ సంయుక్త బృందాలు మెరుపు దాడులు నిర్వహించారు. పసుపులేరు వాగు పరిసర ప్రాంతాల్లో గంగమ్మ గుడి, ఎల్లమ్మ గుడి వద్ద అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న మార్గాన్ని గుర్తించారు. వెంటనే ఆ మార్గాన్ని జేసీబీతో త్రవ్వించి మూసివేశారు. అదేవిధంగా అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని, తిప్పర్ల ద్వారా మెదక్‌లోని సాండ్ బజార్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఆర్.ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ… ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము. అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు కొనసాగిస్తాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ధర్నా**

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 24 :-** జిల్లాలోని అన్ని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లాలో సమగ్ర అభివృద్ధికి బడ్జెట్ లో నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆడివయ్య మాట్లాడుతూ. జిల్లాలోని భూ సమస్యలు ఇండ్లు స్థలాల సమస్యలు ఉపాధి హామీ కూలీల సమస్యలు వివిధ రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం చేయక తప్పదని అయినా అన్నారు.పేరుకు జిల్లా కేంద్రం ఏర్పడినా మెదక్ ఎలాంటి ప్రగతికి నోచుకోలేదన్నారు.వెల్దుర్తి, టేక్మల్,రేగోడ్, నిజంపేట, రామాయంపేట, శివంపేట, చిలప్చేడ్ మండలాల్లో రోడ్లు అన్ని పూర్తి అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు.ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం చేసిన చట్ట సవరణ వల్ల పేదలు కూలి పనికి దూరం అవుతున్నారని అన్నారు.రెండు పూటల పోటో పద్ధతి ద్వారా అటవీ ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక చేసిన పని ఆన్ లోకి రాకపోవడం ద్వారా కూలీలు పనికి రావడం మానేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో అంగ ఏం. ఎన్.ఆర్. ఇ.జి.ఎస్ గా కొనసాగించాలని, రోజు కూలీ రూపాయలు 800 కు పెంచుతూ, సంవత్సరంలో 200 రోజుల కూలీ పనులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జిల్లాలో ప్రజా సమస్యలు పేర్కొన్న జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆయన తెలిపారు ఇప్పటికైనా జిల్లా పరిష్కారం దిశగా చూపాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సి.పి. ఎం పార్టీ జిల్లా కార్యదర్శి కే. నరసమ్మ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. పద్మ,సి.పి.ఏం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మల్లేశం, కే.మల్లేశం,జిల్లా కమిటీ సభ్యులు కే.నాగరాజు,గౌరయ్య, సంతోష్,అజయ్,నరేందర్, దేవయ్య , శౌకత్, వెంకట్, వసంత, తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 24:** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మెదక్ మండలం, మెదక్ పట్టణానికి చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ. 49,60000/సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు చికిత్స ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి తక్షణ సహాయం అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.పేదల ఆరోగ్య రక్షణలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, ఇలాంటి పథకాలు వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు. రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి.నరేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ లు శివరామకృష్ణ, మన్సూర్,రాజశేఖర్,పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం గంగాధర్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి. అశోక్, పట్టణ,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఇంధన భయం… పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు



**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 24:** సిద్దిపేట జిల్లా లో ఇంధన కొరతపై పుకార్లు వ్యాపించడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయనే భయంతో ప్రజలు పెట్రోల్ బంకుల వద్ద భారీగా తరలివస్తున్నారు. జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు పొడవైన క్యూలు కడుతూ కనిపిస్తున్నారు. కొందరు వాహనదారులు బాటిళ్లు, క్యాన్‌లతో ఇంధనం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితి కారణంగా కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా “నో స్టాక్” బోర్డులు కనిపించాయి. అధికారులు ఇంధన కొరతపై వస్తున్న వార్తలను ఖండించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రజలు పుకార్లను నమ్మవద్దని సూచించారు. అవసరానికి మించి ఇంధనం నింపుకోవడం వల్లే తాత్కాలిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు.పెట్రోల్ బంకుల నిర్వాహకులు కూడా ఇంధన సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని, వాహనదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కొన్నిచోట్ల సరఫరాలో స్వల్ప అంతరాయాలు ఉన్నా, పరిస్థితిని సమీక్షిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ప్రజలు శాంతంగా వ్యవహరించి, అనవసర రద్దీని నివారించాలని అధికారులు కోరుతున్నారు.




# మరకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **ప్రోమో రన్ లో సిద్దిపేట పోలీస్ భాగస్వామ్యం అవుతుంది**
- **పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్**

**ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 24:** ప్రస్తుత యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి భవిష్యత్ అంధకారంలోకి వెళ్లకుండా గజ్వేల్ రన్నర్స్ యువతకు ఆదర్శంగా "ప్రోమో రన్"ను నిర్వహించడం అభినందనీయమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్ అన్నారు. గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్ లోగోను, గజ్వేల్ ప్రోమో రన్ వాల్ పోస్టర్ ను సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో వ్యాయామం, యోగాను అలవాటు చేసుకోవాలని కోరారు. గజ్వేల్ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రోమో రన్ లో సిద్దిపేట పోలీస్ భాగస్వామ్యం అవుతుందని, గజ్వేల్ ప్రోమో రన్ లో యువతీ, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు రాజు, నిఖిల్ రెడ్డి, జంగం రమేష్, కె. మధుసూదన్ రెడ్డి, సత్యం, దుంబాల యాలింగారెడ్డి, తాళ్ల నరేష్ గౌడ్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.



# నందిని సిధారెడ్డికి మరసం అభినందన

**ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 24:** ప్రఖ్యాత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం అంటే తెలంగాణ సాహిత్యానికి దక్కిన గౌరవం అని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిన తరువాత మొట్టమొదటి సారిగా తన పురిటి గడ్డ అయిన సిద్దిపేట కు నందిని సిధారెడ్డి మంగళవారం వచ్చారు. ఈసందర్భంగా సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె. రంగాచారి, ప్రధాన కార్యదర్శి సిద్దెంకి యాదగిరి, మరసం ప్రతినిధులు కె. అంజయ్య,పప్పుల రాజి రెడ్డి తోట అశోక్, నందిని భగవాన్ రెడ్డి, అలాజ్ పూర్ శ్రీనివాస్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు పొన్నాల బాలయ్య, ప్రధాన కార్యదర్శి గంభీర్రావుపేట యాదగిరి, ఎడ్ల వెంకట్రాంరెడ్డి, మద్దుల బుచ్చి రాజం రెడ్డి,భిక్షపతి, యాదగిరి సార్..వనం సుధాకర్, బెజగాం శివయ్య తదితరులు సిధారెడ్డిని ఆత్మీయంగా కలిసి సత్కరించారు.. సిద్దిపేట జిల్లా బందారం గ్రామానికి చెందిన నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం సిద్దిపేట జిల్లా కవులకు, ఉమ్మడి మెదక్ జిల్లా కవులకు, మంజీరా రచయితల సంఘానికి గర్వకారణం అని అన్నారు.. గత 50 ఏళ్లుగా సాహిత్య సృజన చేస్తున్న నందిని సిధారెడ్డి తన రచనల ద్వారా సమాజం పై ప్రజల పై గొప్ప ప్రభావాన్ని చూపారని అన్నారు. తెలంగాణ భాషను, యాసను తన రచనల్లో ఎత్తిపట్టి భాషకు సాహిత్య సొబగులు అద్దాడని అన్నారు. మంజీరా రచయితల సంఘం స్థాపన ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది కొత్త రచయితలకు ప్రేరణ ఇచ్చి సాహిత్య రంగంలోకి తీసుకువచ్చారని అన్నారు.. 1996 నుండే తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమానికి మంజీరా రచయితల సంఘం పక్షాన మద్దతు ప్రకటించి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో సిధారెడ్డి కీలక పాత్ర నిర్వహించారని తెలిపారు.."నాగేటి సాల్లల్ల నా తెలంగాణ..నా తెలంగాణ " అనే గొప్ప పాటను, మరికొన్ని పాటలను ఉద్యమానికి అందించిన ఘనత సిధారెడ్డిది అని మరసం ప్రతినిధులు అన్నారు.. కరోనా ఉపద్రవ కాలం లో మానవ సంబంధాలు. మనిషి జీవితం చిన్నాభిన్నం అయిన సందర్భంలో నందిని సిధారెడ్డి " అనిమేష అనే దీర్ఘ కవితా సంపుటిని వెలువరించారని ఆ కవిత్వానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం గొప్ప విషయం అన్నారు.. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి ని మరసం ప్రతినిధులు ఆత్మీయంగా సత్కరించారు..

# బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి

- **రాజకీయ పార్టీలకు కలెక్టర్ సూచన**

**ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 24:** ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు త్వరగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి కే. హేమావతి అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సూచించారు.మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం పై చర్చించి తగు సూచనలు చేశారు. ఓటరు నమోదు పరిక్రియలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర చాలా ముఖ్యమైనదని అన్నారు. ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నందున ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరగాలంటే తప్పనిసరిగా రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు, ఎన్నికల బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పరిశీలించవలసి ఉంటుందని 2002 ఓటర్ జాబితా 2025 ఓటర్ జాబితా సరిపోల్చుకొని ఓటర్ జాబితాలో తీసివేతలు, కొత్త ఓటర్ నమోదు కు సంబంధించిన ప్రక్రియ వేగవంతం చేయవలసి ఉన్నందున ఆయా రాజకీయ పార్టీలు త్వరగా బూతు లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని అన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లతో పేదల జీవితాల్లో చిరునవ్వులు

- **కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరం**
- **మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

**ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 24:** పాపన్నపేట మండలంలోని పొడిచన్‌పల్లి గ్రామంలో 48 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంజీరా గార్డెన్‌లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామాల్లో గుడిసెలు లేకుండా ప్రతి పేద కుటుంబానికి గృహవసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు రూ.118 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నెలలో మరిన్ని గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడుతున్నాయని, ఈ పథకాల ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, నాయకులు ప్రశాంత్ రెడ్డి,గౌస్ పాషా, హౌసింగ్ అధికారులు, సర్పంచ్ లు,మాజీ సర్పంచ్ లు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి

- **మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**




**ప్రతిపక్షం, ప్రతినిధి, మెదక్,మార్చి 24:** క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన కోసం జిల్లాలో విస్తృత చర్యలు చేపట్టాలని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా “టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0” కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ…క్షయ వ్యాధి నియంత్రణలో ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, ప్రజల్లో అవగాహన పెంపు చాలా కీలకమని అన్నారు. అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి, లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి నాట్, మైక్రోస్కోపీ, ఎక్సరే పరీక్షల ద్వారా నిర్ధారణ చేయాలని అధికారులను ఆదేశించారు. డయాబెటిస్, పోషకాహార లోపం, వృద్ధులు మరియు ఇతర సహవ్యాధులు ఉన్నవారిని ప్రాధాన్యంగా స్క్రీనింగ్ చేయాలని సూచించారు. గుర్తించిన కేసులను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచి సమర్థవంతంగా అమలు చేయాలి” అని తెలిపారు. టీబీ రోగులకు తక్షణ చికిత్స అందించడంతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత, బీసీజీ టీకా, లక్షణాలపై (దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి పూట చెమటలు) ప్రజల్లో అవగాహన పెంపు అవసరమని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ.. జిల్లాలో అధిక ప్రమాదం ఉన్న 99 గ్రామాలను గుర్తించామని, ఇప్పటివరకు 389 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. నిశ్చయ పోషణ అభియాన్ కింద టీబీ బాధితులకు నెలకు రూ.1000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆ గ్రామాల్లో సమగ్ర స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టి, ఎక్సరే, స్పుటమ్, హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డీసీహెచ్ శివదయాల్ మాట్లాడుతూ…కేంద్ర ప్రభుత్వ “టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0” లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.క్షయ వ్యాధి గుర్తించిన గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 14 సంవత్సరాల పైబడిన వారికి పరీక్షలు చేసి, లక్షణాలు ఉన్నవారికి వెంటనే చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా క్షయ నివారణపై కరపత్రాలు విడుదల చేసి, వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ హరిత నర్సింగరావు, సూపరింటెండెంట్ సరిత దేవి, శైలజ, హరి ప్రసాద్, ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో అగ్నిప్రమాదాలపై నిగ్గు తేల్చాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న అగ్నిప్రమాద ఘటనలు నిజంగా ప్రమాదాలా, లేక వాటి వెనుక కుట్ర కోణం ఉందా అనేది వెలికి తీయాలి. వరుస ఘటనలు, అవి జరుగుతున్న తీరు చూస్తుంటే కుట్ర ఉందనే అనుమానం వస్తోంది. రాజధానిలో నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.

**- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు**

# విదేశాంగ విధానం మోడీ వ్యక్తిగత విధానమైంది

- మండిపడ్డ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 24:** పశ్చిమాసియా సంక్షోభం గురించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మన విదేశాంగ విధానం ప్రధాని మోదీ వ్యక్తిగత విదేశాంగ విధానంగా మారిపోయిందని దుయ్యబట్టారు. అంతర్జాతీయ స్థాయిలో ఇదొక హాస్యాస్పదమైన అంశంగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ భవన ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక, ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు పాకిస్థాన్ ఒక మధ్యవర్తిగా ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో రాహుల్, మోదీ సర్కార్‌పై విమర్శల వర్షం కురిపించారు. కేరళలో తనకు ఒక కార్యక్రమం ఉన్నందున, పశ్చిమాసియా ఉద్రిక్తతలపై బుధవారం జరిగే అఖిలపక్ష సమావేశంలో తాను పాల్గొనలేనని రాహుల్ గాంధీ తెలిపారు. "మమ్మల్ని వారు అఖిలపక్ష సమావేశానికి పిలిచారు. అందులో చర్చ జరగాలి. కానీ వాళ్లు ఒక నిర్మాణాత్మకమైన తప్పు చేశారు. వ్యవస్థను నాశనం చేశారు. దానిని సరిదిద్దలేం. ప్రధాని మోదీ కూడా అది చేయలేరు. నేను మీకు రాతపూర్వకంగా ఒక విషయం చెప్పగలను. మోదీ భారతదేశం గురించి, భారత రైతుల ప్రయోజనాల కోసం పనిచేయరు. ఆయన అమెరికా, ఇజ్రాయెల్ చెప్పిందే చేస్తారు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



## విశ్వ వీక్షణం



# సైనిక సన్నద్ధతపై రక్షణమంత్రి సమీక్ష

- యుద్ధ పరిస్థితులపై సమీక్షకు అఖిలపక్షం: రాజ్ నాథ్ సింగ్

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 24:** అంతర్జాతీయ, ప్రాంతీయ సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ భద్రత, సైనికపరమైన సన్నద్ధతపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన ఈ కీలక సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్, జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి, డీఆర్‌డీఓ ఛైర్మన్ సమీర్ కామత్ తదితరులు పాల్గొన్నారు. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించిన ప్రస్తుత తరుణంలో భారత్‌పై పడబోయే ప్రభావాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. ఈ సైనిక ఉద్రిక్తతల పర్యవసానాలు ఎక్కడి దాకా చేరొచ్చనే దానిపైనా డిస్కషన్ జరిగింది. కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న పరిస్థితులపైనా సమీక్షించారు. భారతదేశ భద్రతా పరిస్థితులతో ముడిపడిన సమాచారాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తెలుసుకున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ భారత త్రివిధ దళాల సైనిక సన్నద్ధత గురించి ఈ మీటింగ్‌లో ప్రధాన చర్చ జరిగింది. ఈ ఉద్రిక్తతల నుంచి తలెత్తే ప్రమాదాలకు, భారత్ వ్యూహాత్మకంగా ఎలా స్పందించాలనే దానిపైనా ప్లాన్‌లను రెడీ చేశారు. ప్రస్తుతానికి పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల భారత్‌కు ఎలాంటి ముప్పు లేనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా సైనిక సన్నద్ధతపై కేంద్ర సర్కారు ఫోకస్ పెట్టింది. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎదుర్కొనేందుకు సన్నాహాలను మొదలుపెట్టింది. దీంతో పాటు ఇంధన సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రతికూల ప్రభావాలను నివారించే దిశగానూ కేంద్ర ప్రభుత్వం కసరత్తును మొదలుపెట్టింది.




# గెలుపు మీదే.. భయం ఎందుకు



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మనిషి జీవితంలో అతి పెద్ద శత్రువు ఏమిటని ఎవరినైనా అడిగితే, ఒక్కొక్కరు ఒక్కో సమాధానం చెబుతారు. పేదరికం అని కొందరు, అంతుచిక్కని వ్యాధి అని మరికొందరు, వరుసగా వెంటాడే అపజయాలని ఇంకొందరు అంటారు. కానీ, లోతుగా విశ్లేషించే మనస్తత్వ శాస్త్రవేత్తలు, ఆత్మజ్ఞానాన్ని బోధించే ఆధ్యాత్మిక గురువులు ఒకే గొంతుతో చెప్పే చేదు నిజం ఒక్కటే అది 'భయం'. భయం అనేది మనిషిని బతికి ఉండగానే నిర్జీవంగా మార్చే ఒక అదృశ్య సంకెల. కంటికి కనిపించని ఈ సంకెళ్లను తెంచుకోవడానికి, మనసులోని అంధకారాన్ని పారద్రోలడానికి సరైన తాళంచెవి ఏదైనా ఉంటే,అది కొన్ని వేల ఏళ్ల క్రితం కురుక్షేత్ర మైదానంలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి అందించిన అమృత భాండం భగవద్గీత .కాలం మారింది, టెక్నాలజీ పెరిగింది, కానీ మనిషి గుండెల్లో గూడు కట్టుకున్న భయం మాత్రం తగ్గలేదు. అప్పట్లో యుద్ధం అంటే ప్రాణాలు పోతాయన్న భయం ఉండేది, ఇప్పుడు బతుకు పోరాటంలో అడుగడుగునా భయమే.ఉద్యోగం ఎక్కడ ఊడిపోతుందోనన్న ఇన్‌సెక్యూరిటీ. పరీక్షల్లో ర్యాంకు రాకపోతే సమాజం ఏమనుకుంటుందోనన్న ఆందోళన. ప్రేమించిన వారు మనల్ని తిరస్కరిస్తారేమోనన్న ఒంటరితనం. భవిష్యత్తు చీకటిమయమవుతుందేమోనన్న అభద్రతాభావం. ఈ నేపథ్యంలో, రెండున్నర వేల సంవత్సరాల నాటి గీత సూత్రాలు నేటికీ ఎందుకు అంత తాజాగా అనిపిస్తున్నాయి? ఎందుకంటే, గీత శరీరానికి కాదు, మనిషి మనస్తత్వానికి చికిత్స చేస్తుంది.భగవద్గీత రెండవ అధ్యాయంలో శ్రీకృష్ణుడు భయం యొక్క బయోడేటా ను వివరిస్తాడు. "ధ్యాయతో విషయాన్పుంసః సంగస్తేషూపజాయతే" అంటే, మనం ఒక విషయం గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటే, దానిపై విపరీతమైన మొగ్గు ఏర్పడుతుంది. ఆ ఆసక్తి కాస్తా కోరికగా మారుతుంది. ఆ కోరిక తీరకపోతే క్రోధం (కోపం), కోపం వల్ల మతిభ్రమించడం, చివరకు సర్వనాశనం జరుగుతుంది. భయం అనేది బయటి నుంచి వచ్చే వైరస్ కాదు, అది మన అతిగా పెంచుకున్న అటాచ్ మెంట్ (అనుబంధం) వల్ల పుట్టే ఒక మానసిక స్థితి. మనం దేన్నైతే గట్టిగా పట్టుకుంటామో అది పదవి కావచ్చు, పరువు కావచ్చు, మనుషులు కావచ్చు అది మనల్ని వదిలిపోతుందేమో అన్న ఆలోచనే భయానికి ప్రాణం పోస్తుంది. "మనకు నిజంగా సొంతమైనది ఏదీ లేదు, కాబట్టి పోగొట్టుకోవడానికి కూడా ఏమీ లేదు" అనే నిజాన్ని గ్రహించడమే భయంపై మొదటి విజయం. మనిషిని పీడించే అన్ని భయాలకు తల్లి వంటిది మరణ భయం . చనిపోతామనే భయం నుండే మిగిలిన అన్ని చిన్న చిన్న భయాలు పుట్టుకొస్తాయి. ఇక్కడ గీత ఒక అద్భుతమైన సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. "న జాయతే మ్రియతే వా కదాచిత్" ఆత్మకు పుట్టుక లేదు, చావు లేదు. ఇది కేవలం ఒక



**మీరు ప్రస్తుతం చేస్తున్న పనిపై 100% దృష్టి పెడితే భయానికి చోటుండదు. ప్రతిదీ ఫలితంతో ముడిపెట్టవద్దు, మీ విలువను మీ విజయాలతో ముడిపెట్టకండి. మీరు ఓడిపోయినా మీరు మీరే . ఈ స్పష్టత మిమ్మల్ని రిస్క్ తీసుకునేలా చేస్తుంది. ఆత్మవిశ్వాసం పెంచుకోండి రోజూ కొద్దిసేపు ధ్యానం చేస్తూ, నేను శక్తివంతుడను, ఈ శరీరం కంటే గొప్పవాడను అని మీకు మీరు గుర్తు చేసుకోండి. ప్రతి మార్పును అంగీకరించండి (Acceptance), జీవితంలో మార్పులు సహజం. పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడు వాటితో పోరాడటం కంటే, వాటిని అంగీకరించి ముందుకు సాగడం గీత నేర్పే పాఠం.**

మతపరమైన నమ్మకం మాత్రమే కాదు, ఇదొక శక్తివంతమైన సైకలాజికల్ టూల్. నేను కేవలం ఈ శరీరాన్ని మాత్రమే కాదు, నాశనం లేని ఒక చైతన్యాన్ని అని ఎవరైతే అర్థం చేసుకుంటారో, వారిలో ప్రాణ భయం తగ్గుతుంది. ఆధునిక మనస్తత్వ శాస్త్రంలో కూడా Acceptance of Mortality (మరణాన్ని అంగీకరించడం) అనేది మానసిక దృఢత్వానికి ముఖ్యమని చెబుతారు. గీత ఇదే విషయాన్ని "నువ్వు అజరామరుడవు" అంటూ మరింత ధైర్యంగా చెబుతుంది.మనందరికీ బాగా తెలిసిన శ్లోకం నీకు కర్మ చేయడంలోనే అధికారం ఉంది, ఫలితంపై కాదు .దీని లోతును మనం సరిగ్గా అర్థం చేసుకుంటే, సగం ఒత్తిడి మాయమవుతుంది. ఆలోచించండి, మనం ఎప్పుడు భయపడతాం? పని చేస్తున్నప్పుడా? కాదు, పని పూర్తయ్యాక ఫలితం ఏమవుతుందో అని ఊహించుకున్నప్పుడు. బౌలర్ బంతి విసిరేటప్పుడు వికెట్ పడుతుందో లేదో అని భయపడితే, సరైన లైన్ అండ్ లెంగ్త్ వేయలేడు. స్టేజీ మీద మాట్లాడుతున్న వ్యక్తి జనం నవ్వుతారేమో అని భయపడితే, తన విషయం మర్చిపోతాడు. నేటి మేనేజ్మెంట్ నిపుణులు దీనినే ProcessOriented Thinking అంటున్నారు. ఫలితం మన చేతుల్లో లేదు, కానీ ప్రయత్నం మన చేతుల్లో ఉంది. ఫలితాన్ని దైవానికో లేక ప్రకృతికో వదిలేసి, వర్తమానంలో పని చేసే వ్యక్తినే స్థితప్రజ్ఞుడు అంటారు. ఈ డిటాచ్మెంట్ భయాన్ని మటుమాయం చేస్తుంది. "సమత్వం యోగ ఉచ్యతే" గెలుపులో పొంగిపోకుండా, ఓటమిలో కుంగిపోకుండా ఉండడమే యోగం. భయం అంటే ఏమిటి? రాబోయే కాలంలో నాకు ఏదో నష్టం జరగబోతోంది అనే ఊహ. కానీ, గీత బోధించే సమత్వం వల్ల మనిషికి ఒక ఆత్మవిశ్వాసం వస్తుంది. ఏది జరిగినా నేను తట్టుకోగలను, నా మానసిక ప్రశాంతతను ఏ శక్తి దెబ్బతీయలేదు అన్న స్థైర్యమే భయానికి విరుగుడు. దీనినే మనం నేడు Emotional Intelligence అని పిలుచుకుంటున్నాం. సుఖం వస్తే అనుభవించు, దుఃఖం వస్తే స్వీకరించు కానీ దేనికీ నీ మనస్సును లొంగిపోనివ్వకు. జీవితం ఒక పెద్ద భారంగా అనిపించినప్పుడు, మన శక్తినంతటినీ వాడి కూడా ఏదో తక్కువైందని అనిపించినప్పుడు కృష్ణుడు ఒక భరోసా ఇస్తాడు "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ". దీనిని కేవలం భక్తి కోణంలోనే కాకుండా, మానసిక కోణంలో చూడండి. నేనే అన్నీ చేయాలి, ప్రపంచం అంతా నా భుజాల మీదే ఉంది అనుకునే వ్యక్తి విపరీతమైన యాంగ్జైటీకి (Anxiety) గురవుతాడు. నేను నా వంతు కృషి చేస్తాను, మిగిలినది ఆ విశ్వశక్తి చూసుకుంటుంది అని అప్పగించడాన్నే శరణాగతి అంటారు. ఇది బలహీనత కాదు, అహంకారాన్ని వదులుకుని ప్రశాంతతను పొందడం. గీతలోని పదహారవ అధ్యాయంలో దైవీ గుణాల గురించి చెబుతూ, అన్నింటికంటే ముందుగా అభయం (Fearlessness) గురించి ప్రస్తావిస్తాడు కృష్ణుడు. అంటే, భయం లేకపోవడం అనేది ఏదో సాధించాల్సిన విషయం కాదు, అది మన అసలు స్వభావం. మనం పుట్టినప్పుడు నిర్భయంగా పుడతాం. పెరుగుతున్న కొద్దీ సమాజం, పరిస్థితులు, ఓటములు మనకు భయాన్ని నేర్పుతాయి . గీత ప్రయాణం అంటే మనం నేర్చుకున్న ఆ భయాలను ఒక్కొక్కటిగా వదిలించుకుని, మనలోని సహజమైన ధైర్యాన్ని తిరిగి వెలికితీయడమే. గీత కేవలం పుస్తకాల్లో ఉండాల్సిన శ్లోకాలు కాదు, అవి మన దైనందిన జీవితానికి మందు బిళ్ళలు (Pills) లాంటివి. భయాన్ని పోగొట్టుకోవడానికి కొన్ని టిప్స్ మీరు వర్తమానంలో జీవించండి, భయం ఎప్పుడూ భవిష్యత్తు గురించి ఉంటుంది. మీరు ప్రస్తుతం చేస్తున్న పనిపై 100% దృష్టి పెడితే భయానికి చోటుండదు. ప్రతిదీ ఫలితంతో ముడిపెట్టవద్దు, మీ విలువను మీ విజయాలతో ముడి పెట్టకండి. మీరు ఓడిపోయినా మీరు మీరే . ఈ స్పష్టత మిమ్మల్ని రిస్క్ తీసుకునేలా చేస్తుంది. ఆత్మవిశ్వాసం పెంచుకోండి రోజూ కొద్దిసేపు ధ్యానం చేస్తూ, నేను శక్తివంతుడను, ఈ శరీరం కంటే గొప్పవాడను అని మీకు మీరు గుర్తు చేసుకోండి. ప్రతి మార్పును అంగీకరించండి (Acceptance), జీవితంలో మార్పులు సహజం. పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడు వాటితో పోరాడటం కంటే, వాటిని అంగీకరించి ముందుకు సాగడం గీత నేర్పే పాఠం. కురుక్షేత్రంలో అర్జునుడు తన బంధువులను చూసి, తన భవిష్యత్తును ఊహించుకుని చేతిలోని గాండీవాన్ని వదిలేశాడు. మనం కూడా మన జీవితాల్లోని ఒత్తిళ్లకు తలొగ్గి అప్పుడప్పుడు ఆయుధాలు పారేస్తుంటాం. కానీ, కృష్ణుడు చెప్పినట్లు "క్లైబ్యం మా స్మ గమః పార్థ" పిరికితనాన్ని దరిచేరనీయకు. భయం లేని జీవితం అంటే ప్రమాదాలు లేవని కాదు, ఎదురుదెబ్బలు తగలవని కాదు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, గుండె ధైర్యంతో, చిరునవ్వుతో తన కర్తవ్యాన్ని నిర్వహించడమే అసలైన వీరత్వం. గీత మనకు ఇచ్చే గొప్ప హామీ ఒక్కటే, నువ్వు ఒక్కడివి కాదు, నీ వెనుక అనంతమైన జ్ఞానం ఉంది. కావున ఇప్పుడే ఆందోళనను వదిలేయండి. గాండీవాన్ని చేతబట్టండి. మీ జీవిత యుద్ధంలో మీరే విజేతగా నిలవండి. భగవద్గీత నిరంతరం మనతోనే ఉంది, మనలోనే ఉంది.



# మోడీ, అమిత్ షాకు బాంబు బెదిరింపు

- ఢిల్లీ అసెంబ్లీతో పాటు మరికొంత మంది ప్రముఖులకు కూడా

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 24:** దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు.




# ఎయిమ్స్‌లో హరీశ్ రాణా మృతి

- దేశంలోనే మొదటి కారుణ్య మరణం

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 24:** భారత్‌లో తొలి కారుణ్య మరణం (పాసివ్ యూథనేషియా) నమోదైంది. 13 ఏళ్లుగా కోమాలో ఉన్న హరీశ్ రాణా సుప్రీం కోర్టు ఆదేశాలతో కారుణ్య మరణాన్ని పొందారు. ఢిల్లీ ఎయిమ్స్‌లోని బీఆర్ అంబేడ్కర్ ఇన్‌స్టిట్యూట్ రోటరీ క్యాన్సర్ యూనిట్‌లో 31 ఏళ్ల హరీశ్ రాణా ప్రశాంతంగా కన్నుమూశారు. చికిత్సలకు కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్న కుమారుడికి గౌరవప్రదమైన మరణాన్ని ప్రసాదించాలంటూ హరీశ్ తల్లిదండ్రులు అశోక్, నిర్మలా రాణా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మార్చి 11న హరీశ్ కారుణ్య మరణానికి అంగీకరిస్తూ సుప్రీం ఆదేశాలు జారీచేసింది. వ్యక్తి గౌరవానికి భంగం వాటిల్లకుండా ప్రత్యేక ప్రణాళిక ప్రకారం లైఫ్‌సపోర్ట్ తొలగించాలని ఢిల్లీ ఎయిమ్స్‌ను ఆదేశించింది. కారుణ్యమరణంపై సమగ్రచట్టం కూడా తీసుకురావడాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది. తీర్పు అనంతరం రాణాను గజియాబాద్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో చేర్చిన తర్వాత అక్కడి ప్రత్యేక వైద్యుల బృందం క్రమంగా చికిత్సతో పాటు పోషకాహార సహాయాన్ని, చివరగా ఆక్సిజన్‌ను నిలిపివేసింది. 2013లో పంజాబ్ యూనివర్సిటీలో బీటెక్ చేస్తున్న హరీశ్, భవనం నాలుగో అంతస్తు నుంచి కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలవడంతో కోమాలోకి వెళ్లారు. చికిత్స అందించినప్పటికీ ఆయన తిరిగి కోలుకోలేకపోయారు.




# సౌతాఫ్రికా టూర్‌కు వుమెనిండియా రెడీ

వచ్చే నెలలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత మహిళా క్రికెట్ జట్టులో యువ ఆల్‌రౌండర్ అనుష్క శర్మకు తొలిసారిగా చోటు దక్కింది. కొద్దిరోజుల క్రితమే ముగిసిన డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ తరఫున రాణించిన 22 ఏండ్ల ఈ మధ్యప్రదేశ్ అమ్మాయితో పాటు పేసర్ కాశ్వీ గౌతమ్, వికెట్ కీపర్ బ్యాటర్ ఉమా ఛెత్రి జట్టులోకి వచ్చారు. ఈ మేరకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టును బీసీసీఐ మంగళవారం వెల్లడించింది. స్నేహ్ రాణా, వైష్ణవి శర్మ, జి. కమిలిని, అమన్‌జోత్ కౌర్‌పై వేటు పడింది. వచ్చే నెల 17 నుంచి 27 మధ్య ఉమెన్ ఇన్ బ్లూ.. సఫారీలతో ఐదు టీ20లు ఆడనుంది. వచ్చే జూన్‌లో ఇంగ్లండ్ ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్‌నకు ఇది సన్నాహకంగా ఉపయోగపడనుంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, షెఫాలీ, జెమీమా, దీప్తి, రిచా, అరుంధతి, రేణుకా, క్రాంతి, శ్రీచరణి, శ్రేయాంక, కాశ్వీ, ఫల్మలి, ఉమా, అనుష్క



ప్రతిపక్షం
Prathipaksham.in
8
హైదరాబాద్
బుధవారం
25.03.2026
సినిమా

# ఆదిత్యా బిర్లా గ్రూప్ కన్సార్షియం చేతికి చాలెంజర్స్

- రాయల్స్‌ను దక్కించుకున్న సోమానీ, వాల్‌మార్ట్


ఐపీఎల్ 19 ప్రారంభానికి కొద్దిరోజుల ముందే ఈ లీగ్ తొలి సీజన్ విజేత రాజస్థాన్ రాయల్స్‌తో పాటు 18వ సీజన్‌లో కప్పు కొట్టిన డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల అమ్మకం ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఈ ఫ్రాంచైజీలను అమ్మేయనున్నారని గడిచిన ఆరునెలలుగా వస్తున్న వార్తలను నిజం చేస్తూ రాజస్థాన్, బెంగళూరు జట్లు ఐపీఎల్ చరిత్రలోనే భారీ ధరకు అమ్ముడుపోయాయి. అమెరికాకు చెందిన వ్యాపారవేత్త కల్ సోమానీతో పాటు వాల్ మార్ట్ ఫ్యామిలీ (రాబ్ వాల్టన్), హ్యాంప్ ఫ్యామిలీ రాయల్స్‌ను 1.63 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 15,300 కోట్లు)కు దక్కించుకున్నట్టు సమాచారం. ఈ వార్త వెలువడ్డ కొద్దిసేపటికే బెంగళూరు సేల్ డీల్ కూడా ఖాయమైంది. ఆదిత్యా బిర్లా గ్రూప్ (ఏబీజీ), బ్లాక్‌స్టోన్, డేవిడ్ బ్లిట్జర్స్ బోల్ట్ వెంచర్స్‌తో పాటు ప్రముఖ మీడియా దిగ్గజం టైమ్స్ ఆఫ్ ఇండియాతో కూడిన కన్సార్టియం ఆర్‌సీబీని 1.78 బిలియన్ డాలర్ల (రూ. 16,700 కోట్లు)కు సొంతం చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనిపై అటు ఫ్రాంచైజీలు గానీ, ఇటు సంబంధింత కొనుగోలుదారులుగానీ అధికారిక ప్రకటనేమీ చేయకపోయినా త్వరలోనే ఈ ప్రకటన వెలువడనున్నట్టు ఆ ఫ్రాంచైజీల వర్గాలు తెలిపాయి. అయితే తాజా ఐపీఎల్ సీజన్ ముగిసిన వెంటనే అమ్మకానికి సంబంధించిన ప్రక్రియ మొదలవనున్నట్టు తెలుస్తున్నది. బీసీసీఐ ఆమోదం పొందిన వెంటనే యాజమాన్య హక్కులు బదిలీ అవుతాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బీసీసీఐ నిర్వహించే ఏజీఎం తర్వాతే ఈ సేల్ డీల్ పూర్తవనుంది. తాజా డీల్‌తో ఐపీఎల్‌లో బెంగళూరు, రాజస్థాన్ అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీలుగా నిలిచాయి. 2021లో బీసీసీఐ నిర్వహించిన కొత్త ఫ్రాంచైజీల వేలంలో సంజీవ్ గొయెంకా సారథ్యంలోని ఆర్‌పీఎస్‌జీ లక్నో జట్టును రూ. 7వేల కోట్లకు కొనుగోలు చేయడమే ఇప్పటిదాకా రికార్డు. తాజా డీల్ అందుకు రెండింతలుండటం గమనార్హం. నాలుగు సంస్థలతో కూడిన ఆర్‌సీబీ కన్సార్షియం.. యూనైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్‌ఎల్) నుంచి పూర్తిస్థాయి యాజమాన్య హక్కులను సొంతం చేసుకోనుంది.



# వారి జ్ఞాపకార్ధం 11 సీట్లు రిజర్వ్

- తొక్కిసలాట మృతులకు నివాళిగా ఆర్సీబీ నిర్ణయం


ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ సమీపిస్తున్న వేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. నిరుడు చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాట లో మృతి చెందిన 11 మంది అభిమానులను ఆర్సీబీ స్మరించుకోనుంది. విజయోత్సవ యాత్రలో పాల్గొనేందుకు వచ్చి అసువులు బాసిన ఆ పదకొండు మంది అభిమానుల జ్ఞాపకార్ధం ప్రతి మ్యాచ్‌కు 11 సీట్లు రిజర్వ్ చేయాలని ఆర్సీబీ యాజమాన్యం, కర్నాటక క్రికెట్ సంఘం నిర్ణయం తీసుకున్నాయి. పంతొమ్మిదో సీజన్‌లో ఆరంభ పోరుకు మరో నాలుగు రోజులే ఉంది. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆడబోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక నిర్ణయం తీసుకుంది. నిరుడు జూన్ 4వ తేదీన చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 11 మంది అభిమానుల జ్ఞాపకార్థం ప్రతి మ్యాచ్‌లో 11 సీట్లను రిజర్వ్ చేయాలని ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం భావిస్తున్నాయి. ఈ విషయాన్ని బెంగళూరు యాజమాన్యం ధ్రువీకరించింది. ఇదివరకే ఆ 11 మంది కుటుంబాలకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్సీబీ ఇప్పుడు మైదానంలో వారికి ప్రత్యేక గౌరవం కల్పించనుంది.



# కోల్‌కతా వైస్ కెప్టెన్‌గా రింకూ సింగ్

భారత క్రికెటర్, పొట్టి వరల్డ్‌కప్ హీరో రింకూ సింగ్ కు ప్రమోషన్ లభించింది. ఐపీఎల్‌లో సంచలన ఆటతో వెలుగులోకి వచ్చిన రింకూ వైస్ కెప్టెన్‌గా పదోన్నతి పొందాడు. పంతొమ్మిదో సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్యా రహానేకు ఈ సిక్సర్ల వీరుడు డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. ఫినిషర్‌గా రాణిస్తున్న ఈ లెఫ్ట్ హ్యాండర్‌కు వైస్ కెప్టెన్సీ ఇస్తున్నట్టు మంగళవారం కోల్‌కతా ఫ్రాంచైజీ వెల్లడించింది. ఐపీఎల్‌కు గడువు సమీపిస్తున్న వేళ ఫ్రాంచైజీలు నైట్ ఈవెంట్లతో అభిమానులను అలరిస్తున్నాయి. నైట్స్ అన్‌ప్లగింగ్ పేరుతో కోల్‌కతా నైట్ రైడర్స్ మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా కెప్టెన్ అజింక్యా రహానేకు డిప్యూటీగా రింకూ సింగ్ వ్యవహరిస్తారని ఫ్రాంచైజీ వెల్లడించాడు.






# సూరి లీడ్‌రోల్‌లో 'మైత్రి' చిత్రం

టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ ప్రస్తుతం కోలీవుడ్‌లోనూ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఇప్పటికే 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మరియు 'డ్యూడ్' వంటి చిత్రాలతో బ్యాక్‌టుబ్యాక్ హిట్లను అందుకున్న ఈ సంస్థ, తాజాగా తమ మూడవ తమిళ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. వరుస విజయాలతో జోరు మీదున్న ఈ నిర్మాణ సంస్థ, ఈసారి కూడా ఒక భారీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రముఖ నటుడు సూరి ఈ కొత్త చిత్రంలో లీడ్ రోల్ చేయనున్నాడు. 'మామన్' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న సూరి, హీరోగా నటిస్తున్న ఏడవ చిత్రం ఇది. విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను బట్టి చూస్తుంటే, ఇది ఒక పక్కా మాస్ యాక్షన్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. కామెడీ పాత్రల నుండి హీరోగా మారిన సూరి, ఈ సినిమాతో తన మాస్ ఇమేజ్‌ను మరింత బలపరుచుకోవాలని చూస్తున్నాడు. 'అయలాన్' వంటి విభిన్నమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఆర్. రవికుమార్ ఈ ప్రాజెక్ట్‌ను డైరెక్ట్ చేయనున్నాడు. ఈ సినిమాను కేవలం తమిళంలోనే కాకుండా తెలుగులో కూడా విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర బృందం త్వరలోనే వెల్లడించనుంది.

# కోసింది కొయగూర...

## 'గరివిడి లక్ష్మి' నుంచి అదిరిపోయే జానపదం రిలీజ్



భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అద్భుతమైన జానపదం కోసింది కొయగూర సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని రాఎనర్జీ వుండే డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము వోకల్స్ మరింత వైబ్ ని యాడ్ చేశాయి. ఉత్తరాంధ్ర జనపదం మూలం నుంచి స్వరపరిచిన ఈ పాటకు గంటేడ గౌరు నాయుడు, గౌరీ నాయుడు జమ్ము రాసిన అదనపు సాహిత్యం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ సాంగ్ లో ఆనంది పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. రాగ్ మయూర్ ప్రజెన్స్ డ్యాన్స్ మెంట్స్ మరింత జోష్ ని తీసుకొచ్చింది.

# 'రాకాస' థియేటర్లో చూడాల్సిన చిత్రం

### దర్శకురాలు మానస శర్మ

**జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా ఈ చిత్ర విశేషాల్ని పంచుకునేందుకు దర్శకురాలు మానస శర్మ మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..**

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**
మాది శ్రీకాకుళం. నేను మొదటగా యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' చేశాను. ఆ తరువాత 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి క్రియేటర్, రైటర్‌గా పని చేశాను. ఆ తరువాత 'బెంచ్ లైఫ్' సిరీస్‌ని చేశాను. ఇది నాకు నాలుగో ప్రాజెక్ట్. ఫాంటసీ, అడ్వెంచర్‌లతో తీసిన 'రాకాస' చాలా కొత్తగా ఉండబోతుంది.

**'రాకాస'లో ప్రధాన అంశం ఏంటి?**
'రాకాస'ని ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్లో తీశాం. ఇప్పటికే అందరూ మా టీజర్‌ని చూసి ఉంటారు. త్వరలోనే ట్రైలర్ రానుంది. అప్పుడు మా సినిమా గురించి ఇంకా చాలా క్లియర్‌గా తెలుస్తుంది. కామెడీని ప్రధాన అంశంగా, కొద్దిగా హారర్ ఎలిమెంట్స్‌తో పూర్తి ఫాంటసీ, అడ్వెంచర్‌గా ఈ మూవీని తీశాం.

**సంగీత్ శోభన్ ఈ కథలోకి ఎలా వచ్చారు?**
'రాకాస' కథని ముందుగా నెట్ ఫ్లిక్స్‌లో సిరీస్ కోసం చెప్పాను. ఆ టైంలోనే ఈ కథను సంగీత్ విన్నారు. ఆయనకి కూడా కథ చాలా నచ్చింది. అలా ఈ ప్రాజెక్ట్‌లోకి సంగీత్ వచ్చారు. సంగీత్ అద్భుతమైన నటుడు. మంచి వ్యక్తి. అతని కామెడీ టైమింగ్ అంటే నాకు చాలా ఇష్టం.

**'రాకాస' చిత్రీకరణలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**
వెబ్ సిరీస్‌కి, సినిమాకి ఒకే రకమైన ఛాలెంజ్ ఉంటుంది. మేకింగ్ ఒకేలా ఉంటుంది.. రైటింగ్‌లోనే తేడా ఉంటుంది. షూటింగ్ పరంగా, చిత్రీకరణ సమయంలో ఎలాంటి తేడాలుండవు. ఈ సినిమా అవుట్ పుట్ నిహారిక గారికి నచ్చాలని నేను మరింత బాధ్యతగా పని చేశాను. ఈ కథని పదిహేను నిమిషాలు నెరేట్ చేసిన తరువాత నిహారిక గారికి చాలా కాన్ఫిడెంట్ వచ్చేసి ఓకే చెప్పారు.

**నయన్ సారిక గురించి చెప్పండి?**
నయన్ సారిక మంచి నటి. డైరెక్టర్ ఏం చెబితే అది చేస్తారు. ఆల్రెడీ నేను ఇది వరకే ఆమెతో పని చేసి ఉన్నాను. ఆమె టాలెంట్, యాక్టింగ్ చూసే ఈ చిత్రంలోకి తీసుకున్నాం. ఆమె పాత్రని ప్రేక్షకులంతా ఇష్టపడతారు.

**బడ్జెట్ పెరిగిందని అంటున్నారు?**
ముందు నుంచీ మేం బడ్జెట్‌లోనే సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఏ మూవీకి అయినా సరే కొంచెం అటూ ఇటూగానే అవుతుంది. కానీ టీం అంతా ముందే అనుకుని ఉండటంతో చాలా వరకు లిమిట్‌లోనే ఉన్నాం.

**'రాకాస'లో కొత్తగా ఏం ఉండబోతోంది?**
'రాకాస' థియేట్రికల్‌గా ఎక్స్‌పీరియెన్స్ చేయాల్సిన చిత్రం. కథ పూర్తిగా ఫిక్షన్. అన్ని పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఓ అందమైన చందమామ కథలా ఉంటుంది. విజువల్‌గా, సౌండింగ్ పరంగా ఈ మూవీ అందరినీ ఆకట్టుకుంటుంది.

**వీఎఫ్ఎక్స్ పనుల వల్ల సినిమా ఆలస్యం కాలేదా?**
'రాకాస' సెకండాఫ్‌లో ఎక్కువగా వీఎఫ్ఎక్స్ ఉంటుంది. అందుకే మేం ముందుగా సెకండాఫ్ షూట్ చేశాం. ఒక పక్క వీఎఫ్ఎక్స్ వర్క్స్ జరుగుతూ ఉంటే.. ఫస్ట్ హాఫ్‌ని షూట్ చేశాం. అలా మాకు టైం కలిసి వచ్చింది.



**అనుదీప్ మ్యూజిక్ గురించి చెప్పండి?**
నిహారిక గారు అనుదీప్ గారిని సజెస్ట్ చేశారు. అనుదీప్ మాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇప్పటికే టీజర్‌కు ఆయన ఇచ్చిన ఆర్ఆర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆయన ఈ చిత్రానికి ప్రధాన బలం.

**నిర్మాత నిహారిక గారి గురించి చెప్పండి?**
నిహారిక గారితో నాకు మంచి అనుబంధం ఉంది. పింక్ ఎలిఫెంట్‌లో ప్రాజెక్టులు ఎప్పుడూ ఆలస్యం అవ్వవు. అన్నీ కూడా చాలా ఫాస్ట్‌గా జరిగిపోతోంటాయి. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'ని తొమ్మిది నెలల్లో పూర్తి చేశాం. 'కమిటీ కుర్రోళ్లు' ఏడాదిన్నరలో రిలీజ్ అయింది. నిహారిక గారు మంచి నిర్మాత. ఆమె అన్నింటినీ బ్యాలెన్స్ చేస్తారు.

**ఫ్యూచర్ ప్రాజెక్ట్‌ల గురించి చెప్పండి?**
ప్రస్తుతం కొన్ని కథలు, ఐడియాలు ఉన్నాయి. ఏ ప్రాజెక్ట్ చేసినా కూడా అందులో కామెడీ ప్రధానంగా ,ఎంటర్టైన్మెంట్ ఉండేలా చూసుకుంటాను. 'రాకాస' తరువాత వాటి గురించి చెబుతాను.



# యేడాది తర్వాత ఓటిటీలో 'శబ్దం'

తెలుగు, తమిళంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యాక్టర్ ఆది పినిశెట్టి . ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటించిన చిత్రం శబ్దం. వైశాలి ఫేం అరివజగన్ వెంకటాచలం దర్శకత్వం వహించిన ఈ మూవీ హార్రర్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో సాగే రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కింది. 2025 ఫిబ్రవరి 28న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చింది. కాగా శబ్దం లాంగ్ గ్యాప్ తర్వాత ఓటీటీలో తన లక్ పరీక్షించుకునే రెడీ అయింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. కేవలం తమిళంలో స్ట్రీమింగ్ అవుతుండగా.. తెలుగు వెర్షన్‌కు సంబంధించి మేకర్స్ నుంచి ఎలాంటి అప్‌డేట్ అం సుమారు ఏడాది తర్వాత డిజిటల్ ఇవ్వబోతున్న ఈ చిత్రం ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది చూడాలి. ఈ చిత్రంలో అలనాటి అందాల తార లైలా కీలక పాత్రలో నటించగా...సిమ్రన్, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్ స్లే ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. ఈ సినిమాను 7జీ ఫిలిమ్స్, అల్ఫా ఫ్రేమ్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200